## టెట్‌కు సర్వం సిద్ధం : జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకిషన్

**మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్14 (ప్రభాతవార్త):** నేడు జిల్లా వ్యాప్తంగా జరగబోయే టెట్ పరీక్షకు మెదక్‌లో 18 కేంద్రాలు, రామాయంపేటలో 3 కేంద్రాలు జిల్లా వ్యాప్తంగా మొత్తం 21 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకిషన్ తెలిపారు. ఇందుకు గాను 25 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 25 మంది డిపార్ట్మెంటల్ అధికారులు, 70 మంది హాల్ సూపరింటెండెంట్లు, 250 మంది ఇన్విజిలేటర్లు విధుల్లో పాల్గొంటున్నారని వివరించారు. ఉదయం పేపర్-1 కు 5,031 యుంది, మధ్యాహ్నం పేపర్-2 కు 3,368 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని తెలిపారు. ఉదయం 9.30 గంటలు, మధ్యాహ్నం 2.30 గంటలకు పరీక్ష ప్రారంభం కానున్నందున అభ్యర్థులు పరీక్షా సమయానికి గంట ముందుగానే కేంద్రానికి రావాలని సూచించారు. అభ్యర్థులు బ్లాక్ బాల్ పాయింట్ పెన్నుతో మాత్రమే సమాధానాలు రాయాల్సి ఉంటుందన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో టెట్ పరీక్షకు సంబంధించిన సామాగ్రిని చీఫ్ సూపరింటెండెంట్లకు అందజేశారు. రూట్ ఆఫీసర్లు జమ్మా నాయక్, విద్యా శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ విజయలక్ష్మీ, పరీక్షల సహాయ కమిషనర్ రమేశ్వర్ ప్రసాద్, మండల విద్యాధికారి నీలకంఠం, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి పాల్గొన్నారు.




మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త


## ఇది ఆత్మ గౌరవ పోరాటం : పీసీసీ అధికార ప్రతినిధి మ్యాడం బాలకృష్ణ

**మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్14 (ప్రభాతవార్త):** మెదక్ బంద్‌ను అరెస్టులతో అడ్డుకోవాలని చూసినా, ప్రజల ఆత్మగౌరవం ముందు మంత్రి హరీష్‌రావు కుట్రలు చిత్తు అయ్యాయని పీసీసీ అధికార ప్రతినిధి మ్యాడం బాలకృష్ణ వ్యాఖ్యానించారు. ఈ మేరకు గురువారం ఆయన మెదక్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. మెదక్ బంద్ విజయవంతం చేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. మెదక్ ప్రజల ఆత్మగౌరవానికి, సిద్దిపేట దొరల పెత్తనానికి మధ్య జరుగుతున్న సమరమే ఈ బంద్ అని ప్రకటించారు. వేలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలను పోలీస్ స్టేషన్‌లో ఉంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నేతలను పోలీస్ స్టేషన్‌లో పెట్టిన వారికి గట్టి సమాధానం చెబుతామని హెచ్చరించారు. మంత్రి హరీష్‌రావు మెదక్‌కు చేసిన అన్యాయం ఇప్పట్లో తీరేది కాదన్నారు. మెడికల్ కళాశాల మాత్రమే కాదు అన్నింటా మెదక్‌ను ముంచిన ఘనుడు, ద్రోహి మంత్రి హరీష్‌రావు అన్నారు. మెదక్ ప్రజలకు ఎమ్మెల్యే ఎవరో తెలియదని, పరిపాలనపై పెత్తనం భర్త దేవేందర్‌రెడ్డి, మంత్రి హరీష్‌రావులదే అని ఆరోపించారు. మెదక్ ఎమ్మెల్యే ఒట్టి డమ్మీ అన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య

## ప్రధాని మోడీ పాలన విభజించు పాలించు అన్నట్లుగా ఉంది

**కెసిఆర్ ప్రయాణం ఎర్రవెల్లి నుంచి చర్లపల్లికే..**

**కాంగ్రెస్ సభను విజయవంతం చేయాలి : పొన్నాల లక్ష్మయ్య**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** కేంద్రంలోని ప్రధాన మంత్రి మోడీ పాలన విభజించు పాలించు అన్నట్లుగా ఉందని మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని తాడూరి బాలా గౌడ్ ఫంక్షన్ హాల్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. బిజెపి అధికార ంలోకి వచ్చిన తర్వాత ప్రధాని మోడీ రాజకీయాలకే ప్రాధాన్యత ఇస్తున్నారు తప్ప సమాజ శ్రేయస్సును ఏనాడు పట్టించుకున్న పాపానపోవడం లేదన్నారు. స్వయన ప్రధాన మంత్రి, కేంద్ర హోంశాఖ మంత్రి, సిఎం కెసిఅర్ అత్యంత అవినీతి పరుడు అంటున్నారే తప్ప చర్యలు మాత్రం తీసుకోవడం లేదన్నారు. సిఎం కెసిఅర్ కుటుంబ సభ్యుల అవినీతి అందరికీ తెలుసునన్నారు. ధరణి మొత్తం అవినీతి మయమైందన్నారు. సిఎం కెసిఅర్ ప్రజలను కలువరు.. ప్రతిపక్షాలను మాట్లాడనివ్వరని వాపోయారు. కెసిఅర్‌పై ప్రజలు తిరగబడే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. కెసిఅర్ ప్రయాణం ఎర్రవెల్లి నుంచి చర్లపల్లికేనని అరోపించారు కాంగ్రెస్ పార్టీ మొదటి సారిగా సిడబ్ల్యుసి సమావేశం తెలంగాణ విమోచన దినోత్సవం రోజున హైదారాబాద్‌లో నిర్వహిస్తుందన్నారు. హైదారాబాద్‌లో ఈనెల 17న నిర్వహించే కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభకు పార్టీ శ్రేణులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయలన్నారు. సభలో సోనియాగాంధీ దేశానికి దిశ నిర్దేశం చేయనుందన్నారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షులు నర్సారెడ్డి, పార్టీ నాయకులు దరిపల్లి చంద్రం, గూడూరి శ్రీనివాస్(ఎస్టీడి), తాడూరి శ్రీనివాస్ గౌడ్, పూజల హరికృష్ణ, మహేందర్‌రావు, దేవులపల్లి యాదగిరి, బొమ్మల యాదగిరి, ఎం.డి.ఇమామ్(అత్తు), పూజల గోపికృష్ణ, వంగరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## రాబోయే ఎన్నికల్లో అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్**



శిక్షణ కార్య క్రమ ంలో మాట్లాడుతున్న కలెక్టర్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** రాబోయే ఎన్నికల్లో అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్ అధికారులకు సూచించారు. రాబోయే ఎన్నికల సందర్భంగా గురువారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లాలోని సెక్టార్ అధికారులు, రూట్ అధికారులకు నిర్వహించిన శిక్షణ శిబిరంలో అయన మాట్లాడారు. శాసనసభ నియోజకవర్గాల వారీగా సెక్టర్, రూట్ అధికారులు ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేసుకోవాలన్నారు. రెండు రోజులలో సంబంధిత పోలింగ్ కేంద్రాలు, పోలింగ్ బూత్‌లను సందర్శించి సమాచారాన్ని సేకరించాలన్నారు. పూర్తి పారదర్శకంగా విధులు నిర్వహించాలన్నారు. విధి నిర్వహణలో ఎలాంటి అలసత్వం వహించొద్దన్నారు. నోటిఫికేషన్ రాగానే ఎన్నికల అధికారులు ఎలక్షన్ కమిషన్ కింద విధులు నిర్వహిస్తున్నామని విషయం తెలుసుకోవాలన్నారు. ఎలక్షన్ మ్యానువల్ బుక్‌లో ఉన్న సమాచారాన్ని ఒకటికి రెండు సార్లు చదువుకోవాలన్నారు. వర్ణలేబులిటీ మ్యాపింగ్, సంబంధిత గ్రామాలను, పోలింగ్ కేంద్రాలను, ఓటర్స్ లిస్టు తయారు చేసుకోవాలన్నారు. సెక్టర్ అధికారులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి ఎలక్షన్ నియమ నిబంధనలు తూచా తప్పకుండా పాటించాలన్నారు. జిల్లాలో ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి ప్రతి ఒక్క అధికారి, సిబ్బంది తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. సీపీ శ్వేత తదితరులు మాట్లాడారు. శిక్షణ శిబిరంలో జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, అడిషనల్ డీసీపీ అడ్మిన్ శ్రీనివాస్, అర్డీలు రమేష్‌బాబు, బెన్ షాలోమ్, బన్సీ లాల్, ఏసీపీలు సురేందర్‌రెడ్డి, రమేష్, సతీష్, చంద్రశేఖర్, వివిధశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్ పాలనలో గ్రామాల్లో ఉహించని అభివృద్ధి

**ఎంపిటిసి రాష్ట్ర నాయకుడు దేవి రవీందర్**

**కొండపాక, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త**

సీఎం కేసీఆర్ పాలనలో గ్రామ ప్రాంతాలు ఎంతో అభివృద్ధి చెంది ప్రజలు అనందంగా ఉన్నారని ఎంపిటీసిల పోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్, బిఆర్ఎస్ మండల కో అర్డినేటర్ ర్యాగల్ల దుర్గయ్య అన్నారు. గురువారం వెలికట్టలో గ్రామ అభివృద్ధి కోసం నిధులు మంజూరి చేసినందుకు సీఎం కేసీఆర్, మంత్రి హరీష్‌రావు ప్లేక్సిలకు పాలభిషేక ం చేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు నూనె కుమార్, ఎంపిటీసిల మండల ఫోరం అద్యక్షుడు చింతల సాయిబాబాతో కలిసి వారు మాట్లాడారు. గత 70 యేండ్లలో ఎప్పుడు జరగని అభివృద్ధి తెలంగాణలో ఈ 10 యేండ్లల్లో సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో ఉహించలేనంత అభివృద్ధి జరిగిందన్నారు. ముచ్చటగా మూడవ సారి తిరిగి కేసీఆర్‌ను భారీ మోజార్టీతో గెలిపించుకుందామని సూచించారు. ఆంధ్ర పాలకులు అప్పుడు తెలంగాణ ప్రాంతాన్ని నిర్లక్ష్యం చేశారన్నారు. పట్టణాలకు ధీటుగా పల్లెలు అభివృద్ధి చెందాయన్నారు. విశ్వనాద్‌పల్లి రోడ్డుకు రూ॥ 1.90 లక్షలు. మహిళ భవనానికి రూ॥ 25 లక్షలు, యాదవ కుల సంఘం భవనానికి రూ॥ 23.50 లక్షలు, రజక కుల సంఘం భవనానికి రూ॥ 18.50 లక్షలు, మురికి కాలువల నిర్మాణనికి రూ॥ 10 లక్షలు, పంక్షన్ హాల్ మి గులు పనులకు రూ॥ 10 లక్షలు, మాల కుల సంఘం భవన ప్రహ గోడ నిర్మాణనికి రూ॥ 2 లక్షలు మంజూరి చేసినందుకు కృతజ్ఞ తలు తెలిపారు. తిమ్మారెడ్డిపల్లి, దర్గా సర్పంచులు మల్లమారి రవీందర్, పొడిశెట్టి శ్రీనివాస్, ప్యాక్స్ డైరెక్టర్ సురేందర్, మర్పడ్గ ఎంపిటిసి అంజనేయులు, ఉప సర్పంచ్ నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

**పర్యావరణ రక్షణ అందరి బాధ్యత : జిల్లా కలెక్టర్ రాజర్షిషా**

**మెదక్ అర్బన్, సెప్టెంబర్14 ప్రభాతవార్త :** గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో శాంతియుతంగా, సమన్వయంతో ఘనంగా జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శినితో కలిసి వినాయక నవరాత్రి ఉత్సవ వేడుకల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వినాయక నవరాత్రి ఉత్సవ వేడుకలను జిల్లాలో ప్రశాంత వాతావరణంలో సామరస్య పూర్వకంగా ఘనంగా నిర్వహించుకోవడానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మట్టి గణపతి పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం అనే నినాదంతో ప్రతిఒక్కరూ వినాయక చవితి వేడుకలు జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. మట్టి విగ్రహాల వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కాలుష్య నియంత్రణ మండలి చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్, విద్యుత్, మున్సిపల్ తదితర శాఖల అధికారులు సంయుక్తంగా పరిశీలన చేసి వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసే గణేష్ మండళ్లకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలన్నారు. పారిశుద్ధ్యం, త్రాగునీరు, మొబైల్ టాయిలెట్లు, గుంతలు పూడ్చడం వంటి సౌకర్యాలు కల్పించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. మండపాల వద్ద విద్యుత్ ప్రమాదాలు సంభవించకుండా లూస్ వైర్లను సరిచేయాలని, నిరంతరం విద్యుత్ సరఫరా అందిస్తూ పర్యవేక్షించాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. నిమజ్జనం రోజుల్లో అవసరమైన క్రేన్‌లు, విద్యుత్, ఇతర



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజర్షిషా, పాల్గొన్న అధికారులు ప్రజాప్రతినిధులు

సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పట్టణంలోని ముఖ్య కూడళ్లలో వైద్య శిబిరాలు నిర్వహించాలని, అంబెలెన్స్, అగ్నిమాపక వాహనాలు అందుబాటులో ఉంచాలన్నారు. జిల్లా ఎస్పీ రోహిణి ప్రయిదర్శిని మాట్లాడుతూ ఈ నెల 18 నుండి 28 వరకు జిల్లాలో నిర్వహించే వినాయక చవితి ఉత్సవాలను పండుగ వాతావరణంలో నిర్వహించుకోవాలన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని పోలీస్ శాఖ ద్వారా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రతి గణేష్ మండపానికి నిర్వాహకులు అనుమతి పొందాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం మట్టి వినాయకులను ప్రతిష్ఠించాలని కాలుష్య నియంత్రణ మండలి పంపిణీ చేయబడిన పోస్టర్‌ను కలెక్టర్, ఎస్పీ, అధికారులు ఆవిష్కరించారు. అనంతరం జిల్లా అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ ఈ నెల 17న జరిగే తెలంగాణ జాతీయ సమైక్యత దినోత్సవం కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు రమేష్, వెంకటేశ్వర్లు, డీఆర్వో పద్మశ్రీ, అదనపు ఎస్పీ మహేందర్, జిల్లా వైద్యాధికారి చందు నాయక్, తూప్రాన్, మెదక్, నర్సాపూర్ ఆర్డీవోలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బిజెపి,బిఆర్ఎస్ తోడు దొంగలు

**ఇచ్చిన హమీలు అమలు చేయని దొంగలపై తిరగబడుదాం..తరిమికొడదాం : మాజీ మంత్రి వి.హన్మంతరావు**

**హుస్నాబాద్,సెప్టెంబరు14,ప్రభాతవార్త :** బిజెపి,బిఆర్ఎస్ పార్టీలు తోడు దొంగలు అని మాజీ రాజ్యసభ సభ్యులు,మాజీ మంత్రి వి హన్మంతరావు అన్నారు.గురువారం రోజున టిపిసిసి ఆదేశాల మేరకు తిరగబడదాం తరిమికొడదాం కార్యక్రమంలో భాగంగా మాజీ ఎంపి పొన్నం ప్రభాకర్,మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డిలు ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరయ్యారు.ఈ సందర్బంగా పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అరి ్పంచారు.అనంతరం చౌరస్తా నుండి రాజ రాజేశ్వర ఫంక్షన్‌హాల్ వరకు ఆ పార్టీ శ్రేణులతో కలసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యమ సమయంలో ప్రత్యేక తెలం గాణ ఇస్తే సోనియాగాంధీ కాళ్ళు కడిగి నెత్తిన పోసుకుంటానన్న ముఖ్యమంత్రి కేసీఆర్ అసలు సోనియాగాంధీ ఎవరు అని అనడం హాస్యస్పదంగా ఉందన్నారు.దేశం కోసం ప్రాణాలను సైతం లెక్క చేయని కుటుంబం నెహ్రూ కుటుంబం అని,14 ఏళ్ల జైలు జీవి తాన్ని గడిపి దేశాన్ని సాధించింది ఈ గాంధీ కుటుంబమేనని గుర్తు చేశారు. నెహ్రూ వారస త్వమే కాగ్రెస్ పార్టీ అన్నారు.ఇచ్చిన హామీలను అమలుచేయని తోడు దొంగలైన బిజెపి, బిఆర్ఎస్ ప్రభుత్వాలపై తిరగబడి తరిమికొట్టాలన్నారు. హుస్నాబాద్ టికెట్టు విషయంలో కార్యకర్తలు ఆందోళన చెందవద్దని.. అదిష్టానం టికెట్టు ఎవరికి కేటాయించినా గెలు పేలక్ష్యంగా పార్టీనాయకులు,కార్యకర్త_లు సమిష్టిగాపని చేయాలని సూచించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వి హన్మంతరావు

**విజయభేరి మహాసభ విజయవంతం చేయాలి**

కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటి ఆధ్వర్యంలో నిర్వహించే విజయభేరి మహాసభ ఈనెల 17వ తేదీన హైదరాబాద్‌లోని తుక్కుగూడలో నిర్వహించడం జరుగుతోందని ఈ మహాసభకు పార్టీ అధినేత సోనియాగాంధీ విచ్చేస్తురని కావున ఈ ప్రాంతం నుండి ప్రజలు,కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని హన్మంతరావు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో టిపిసిసి మెంబర్ కేడం లింగమూర్తి,సింగిల్‌విండో చైర్మెన్ బొలిశెట్టి శివయ్య,పార్టీ మండల అధ్యక్షులు బంక చందు,జంగపల్లి ఐలయ్య కౌన్సిలర్లు చిత్తారి పద్మ రవిందర్,పున్న లావణ్యసది,భూక్య సరోజన,అక్కన్నపేట సర్పంచ్ ముత్యాల సంజీవరెడ్డి,సీనియర్ నాయకులు బురుగు కిష్టస్వామి,వెన్న రాజు,ఎండి హస్సన్,మైదంశెట్టి వీరన్న,పాండ్రాల దామోదర్,దాసరి ప్రవీణ్, సురేష్ పాల్గొన్నారు.

## మల్లన్న స్వామి ఏం జరుగుతోంది

**అవినీతి ఆరోపణలతో ఒకరిపై ఒకరు దూషణలు**

**ఆలయ ప్రతిష్టకు భంగం కలిగించేలా ప్రవర్తన**

**ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మల్లన్నన భక్తులు**

**కొమురవెల్లి, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లి మల్లికార్జున స్వామి అలయంలో వివాదాలు చుట్టుముడుతున్నాయి. అధికారులు, పాలకమండలి చైర్మన్ మధ్య సయోధ్య కుదరక ఒకరిపై ఒకరు అవినీతి అరోపణలు చేసుకుంటున్నారు. గత కొన్ని రోజులుగా అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలే నియమించలేదని కొమురవెల్లి గ్రామానికి చెందిన నలుగురు ఈఓ బాలాజీ, చైర్మన్ బిక్షపతి ముందు పెట్రోల్ డబ్బాలతో హల్ చల్ చేశారు. ఈ వివాదం సద్దు మనగానే పారిశుద్ధ్య కార్మికులు రెగ్యులర్ చేయాలని రాజగోపురం ముందు నిరసన వ్యక్తం చేశారు. వారిని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి సముదాయించారు. మరుసటి రోజే అలయంలో నిఘా వ్యవస్థ కోసం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ధ్వంసం చేశారని అలయ చైర్మన్ బిక్షపతి ఏఈవో అంజయ్యపైన అరోపణలు చేశారు. ఇలా ఒకరిపై ఒకరు అరోపణలు చేసుకుంటూ కొమురవెల్లి మల్లన్న అలయ ప్రతిష్టను దిగజార్చే విధంగా చేస్తున్నారని బహిరంగంగానే భక్తులు, గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. మల్లన్న అలయంలో జరుగుతున్న అవినీతి అరోపణలు కావాలనే రాజకీయం చేస్తున్నారని కొంత మంది వాదన చైర్మన్ అవినీతికి పాల్పడ్డాడని అలయ ఉద్యోగుల్లో చాలా మంది దగ్గర అలయ అభివృద్ధి కోసం చేసే పనుల్లో కాంట్రాక్టర్ల వద్ద డబ్బులు వసూలు చేసి నాణ్యత లేకుండా పనులు చేస్తున్నారని గతంలో సీపీఎం పార్టీ నాయకులు అరోపించారు. అయినా కూడా మల్లన్న అలయంలో జరిగే అభివృద్ధి కంటే అవినీతి ఎక్కువ జరుగుతుందని గ్రామస్తులు, మల్లన్న భక్తులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. దేవాదాయ ధర్మాదాయ కమిషనర్ స్పందించి మల్లన్న అలయంలో జరుగుతున్న అవకతవకలపై విచారణ చేసి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని భక్తులు కోరుతున్నారు.

## కిషన్‌రెడ్డిని అరెస్టు చేయడం సిగ్గుచేటు

**అక్రమ అరెస్టులకు భయపడేదిలేదు**

**బిజెపి జిల్లా కార్యదర్శి కుడిక్యాల రాములు**

**గజ్వేల్, సెప్టెంబర్ 14 (ప్రభాతవార్త):** తెలంగాణ రాష్ట్రంలో ఉన్న 25 లక్షల మంది యువకుల భవిష్యత్తు కోసం పోరాటం చేస్తున్న కేంద్ర మంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని అక్రమ అరెస్ట్ చేయడం సిగ్గుచేటని బిజెపి సిద్దిపేట జిల్లా కార్యదర్శి కుడిక్యాల రాములు, బిజెవైఎం సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడు దేవులపల్లి మనోహర్‌యాదవ్, బిజెపి గజ్వేల్ మండల అధ్యక్షుడు పంజాల అశోక్‌గౌడ్‌లు విమర్శించారు. గురువారం గజ్వేల్ పట్టణంలోని బిజెపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో శాంతియుతంగా దీక్షలు చేసుకునే హక్కు కూడా లేదా, ప్రతిపక్షాలకు మీ పాలన, మీ వ్యవహారం చూస్తుంటే నిజాం రజాకార్లను తలపిస్తుందన్నారు. తెలంగాణ ఉద్యమాన్ని ఉధృతం చేసిన గొప్ప నాయకుడు కిషన్‌రెడ్డి అని, అలాంటి వారిని ఇబ్బందులకు గురిచేయడం సరైందికాదన్నారు. ఉద్యమ బిడ్డకు ఇచ్చే గౌరవం ఇదేనా అని, అధికార మదంతో ఎగిసిపడుతున్నారన్నారు. రాబోయే రోజుల్లో నిన్ను, నీ ప్రభుత్వాన్ని ఎక్కడ కానరాకుండా చేస్తామని, నిన్ను గద్దె దింపే వరకు బిజెపి పోరాటం చేస్తుందన్నారు. ఎన్ని అక్రమ అరెస్టులు చేసినా భయపడేదిలేదని, యువత భవిష్యత్తు కోసం పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి గజ్వేల్ మండల ప్రధాన కార్యదర్శి పంజాల వెంకట్‌గౌడ్, బిజెవైఎం మండల అధ్యక్షుడు వేములవాడ మహేష్‌చారి, పట్టణ ప్రధాన కార్యదర్శి కాశమైన నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మాభిమానం దెబ్బతీస్తే సహించేది లేదు

**-ప్రోటోకాల్ పాటించని అధికారులపై ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేస్తా**

**-అమీన్‌పూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ నందారం నరసింహాగౌడ్**

**అమీన్‌పూర్, సెప్టెంబర్14 ప్రభాతవార్త:** అమీన్‌పూర్ మున్సిపల్ వైస్ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి నేటి వరకు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సహకారంతో ప్రభుత్వ నిధులతో పాటు నా స్వంత నిధులతో సైతం ఇట్టి కాలనీల అభివృద్ధికి పాటుపడుతూ ప్రభుత్వానికి పేరు తీసుకొచ్చేలా ఎంతగానో కృషి చేశానని అమీన్‌పూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ నందారం నరసింహాగౌడ్ తెలిపారు. కాగా గత కొంత కాలంగా తనను అవమానించే విధంగా తన పదవీని అగౌరవపరుస్తూ మా స్వపక్ష ప్రజాప్రతినిధులతో పాటు అధికారులు వ్యవహరిస్తున్న తీరు తనను ఎంతగానో ఆవేదనకు గురి చేస్తుందని అమీన్‌పూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ నందారం నరసింహాగౌడ్ తెలిపారు. తాను ఒక మున్సిపల్ వైస్ చైర్మన్ అన్న గుర్తింపు ఇవ్వకపోగా తనకు ఓట్లు వేసి కౌన్సిలర్‌గా గెలిపించిన వార్డులో సైతం తనకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా అధికారిక కార్యక్రమాలు నిర్వహించడచం పట్ల వారి ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదన్నారు. తాను ప్రతినిథ్యం వహిస్తూ తనను గెలపించిన ప్రజల ముందు తనను అవమానపరుస్తూ అగౌరవ పరచాలని చూస్తున్నారని చెప్పుకొచ్చారు. తనకు ఎటువంటి పదవులు ముఖ్యం కాదని, ఆత్మాభిమానం చంపుకొని రాజకీయాలు చేయనని ఈ సందర్భంగా తెలుపుతున్నానన్నారు. ఇప్పటి వరకు కేవలం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిపై ఉన్న అభిమానంతోనే తనపై జరుగుతున్న వివక్షను సైతం సర్ధుబాటు చేసుకొని ముందుకు సాగుతున్నానన్నారు. ఇప్పటివరకు అనేక మానాసిక ఒత్తిడిని భరించానని, ఇకపై సహించేది లేదన్నారు. తన ఓపికను పరీక్షించి చేతగాని వాడిలా ప్రదర్శించేందుకు ఒక వర్గం ప్రయత్నిస్తుంద, ఇకపై ప్రోటోకాల్‌కు విరుద్ధంగా వ్యవహరించి తన విధులకు ఆటంకం కలిగిస్తున్న స్థానిక అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని ఆయన తెలిపారు.

## పార్టీ వీడనున్న మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్?

**-బిసి వాదాన్ని బలంగా వినిపించే ప్రయత్నాలు**

**బిసి నాయకులతో సమావేశాలు**

**గజ్వేల్, సెప్టెంబర్ 14 (ప్రభాతవార్త):** గతకొద్ది నెలల నుండి గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ గజ్వేల్ నియోజకవర్గంలో బిసి వాదాన్ని తెరపైకి తీసుకువచ్చారు. గత ఐదు సంవత్సరాల క్రితం బిఆర్ఎస్ పార్టీలో చురుకుగా పాల్గొంటూ గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్‌గా సిఎం కెసిఆర్ చేసిన అభివృద్ధిలో భాగస్వాములయ్యారు. గత రెండు సంవత్సరాల నుంచి మున్సిపల్ పరిధిలో పార్టీ పరంగా ఎలాంటి సమావేశాలకు కానీ, పార్టీకి సంబంధించిన విషయాలలో తనకు సమాచారం అందడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తుంది. గతంలో రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావుతో పాటు మెదక్ ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డి సైతం గాడిపల్లి భాస్కర్‌ను బుజ్జగించి పార్టీ కార్యక్రమాలలో పాల్గొనాలని చెప్పినా సైతం గాడిపల్లి భాస్కర్ తన వైఖరి మారకపోవడం కనిపిస్తుంది. గజ్వేల్ నియోజకవర్గంలో బడా నాయకునిపై కోపంతోనే పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనడంలేదని స్పష్టమవుతుంది. సిఎం కెసిఆర్ మరోసారి గజ్వేల్ నియోజకవర్గం నుండి పోటీ చేస్తానని చెప్పడంతో గజ్వేల్‌లో బిఆర్ఎస్ పార్టీలో నాయకుల మధ్య సయోధ్య లేకపోవడం కనిపిస్తుంది. రానున్న ఎన్నికల్లో ఒక కీలకమైన వ్యక్తి బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేస్తే జరిగే పరిణామాలు ఎలా ఉంటాయో చూడాల్సిందే. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ పార్టీ వీడనున్నట్లు పట్టణంలో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఏదిఏమైనా సిఎం కెసిఆర్ గజ్వేల్ నుండి పోటీ చేసే సమయంలో అందరు కలిసికట్టుగా ఉండి భారీ మెజార్టీతో గెలిపించే విధంగా చూడాలని పలువురు కోరుకుంటున్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగ్గారెడ్డి

## కాంగ్రెస్ విజయభేరి సభను జయవంతం చేయాలి

**టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే జగ్గారెడ్డి**

**రామచంద్రాపురం, సెప్టెంబరు 14, ప్రభాతవార్త:** ఈ నెల 17వ తారీఖున హైద్రాబాద్‌లోని తుక్కుగూడలో పిసిసి ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవం సందర్బంగా నిర్వహించే కాంగ్రెస్ పార్టీ విజయభేరి సభను జయవంతం చేయాల్సిన అవసరం ప్రతి కార్యకర్తపై ఉందని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్, సంగారెడ్డి ఎమ్మెల్యే తూర్పు జయప్రకాశ్‌రెడ్డి (జగ్గారెడ్డి) పిలుపు నిచ్చారు. రామచంద్రాపురం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. సభను విజయవంతం చేసేందుకు జన సమీకరణ, సభను జయవంతం చేసేందుకు జగ్గారెడ్డికి జిల్లాలోని 5 నియోజకవర్గ బాధ్యతలు అప్పగించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జగ్గారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గం నుంచి సభకు జనసమీకరణకు తన వంతుగా తెల్లాపూర్ మున్సిపాలిటీ నాయకులు అరుణ్, నియోజకవర్గ ఇంచార్జి కాట శ్రీనివాస్‌గౌడ్‌లకు 1 లక్ష రూపాయలను తన వంతుగా అందచేస్తానన్నారు. కార్యకర్తల తరలింపుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నాయకులకు వివరించారు. కార్యక్రమంలో పటాన్‌చెరు కో-ఆర్డినేటర్ శ్యామ్‌గౌడ్, మాజీ కార్పోరేటర్ సఫాన్‌దేవ్, పిసిసి సభ్యులు కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు సుధాకర్‌గౌడ్, వడ్డె క్రిష్ణ, పుట్ట నర్సింగ్, పట్టణ అధ్యక్షులు నర్సింహారెడ్డి, మున్సిపాలిటీ అధ్యక్షులు పట్లోళ్ళ శశిధర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, సి ప్రభాకర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షులు ఈశ్వర్‌సింగ్, శ్రీనివాస్, రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులు నర్సింహా, సంగారెడ్డి జిల్లా మైనార్టీ అధ్యక్షులు హబాబ్‌జాని, ఎస్‌సి సెల్ అధ్యక్షులు యాదగిరి, శాసన సభ ఎస్సీ సెల్ అధ్యక్షులు కొనింటి మహేశ్, యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ నరేశ్, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పనిని సద్వినియోగం చేసుకోవడం సిద్దిపేట నుంచే నేర్చుకోవాలి

**రాష్ట్ర మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీబాయి**



ఎఎంసి చైర్మన్‌తో కలిసి ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను పరిశీలిస్తున్న రాష్ట్ర మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీబాయి

**సిద్దిపేట రూరల్, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త:** సిద్దిపేట అభివృద్ధి నిత్యనూతన మే అని ఎప్పుడు వచ్చినా ఏదో కొత్త అభివృద్ధి చూస్తామని ఇది మంత్రి హరీష్‌రావు నిత్య పర్యవేక్షణతోనే సాధ్యం అని రాష్ట్ర మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీబాయి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్, రైతు బజార్, బుస్సాపూర్ బయో గ్యాస్ ప్లాంట్, స్లాటర్ హౌస్, స్లాటర్ హౌస్ బయోగ్యాస్ ప్లాంట్‌లను సిద్దిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ మచ్చ విజితవేణుగోపాల్‌రెడ్డితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో వెజ్, నాన్ వెజ్ ఫిష్ కాంప్లెక్స్‌లలో కలియతిరిగి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మార్కెట్‌లో అందుతున్న క్రయ, విక్రయాలను అడిగి తెలుసు కున్నారు. సమీకృత మార్కెట్‌లో పరిశుభ్రత, అందుతున్న సేవపలై అమె సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం రైతు బజారును సందర్శించి రైతులతో మాట్లాడారు. రైతు బజార్‌లో ఉన్న బయో గ్యాస్ సేవలను 15 రోజుల్లోగా పునరుద్దరించాలన్నారు. బుస్సాపూర్ వద్ద నిర్మించిన బయో గ్యాస్ ప్లాంట్‌ను సందర్శించి రాష్ట్రాంలనే అదర్శమన్నారు. అంతకు ముందు అమెకు ఎఎంసి చైర్మన్ మచ్చ విజితవేణుగోపాల్‌రెడ్డి, డైరెక్టర్లు పుష్పగుచ్చం అందజేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో అడిషనల్ డైరెక్టర్ మార్కెటింగ్ లక్ష్మణుడు, డిప్యూటీ డైరెక్టర్ పద్మార్థ, గంగాద్రిరావు, డీఈ మహేందర్, డిఎంఓ నాగరాజు, స్పెషల్ గ్రేడ్ సెక్రెటరీ వెంకటయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు దరిపల్లి శ్రీను, హేమంత్, సత్యంరెడ్డి, సంతోష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

## సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెతో... మూతపడిన మండల వనరుల కేంద్రం

**జగదేవ్‌పూర్, సెప్టెంబర్ 14 (ప్రభాతవార్త):** సమగ్ర శిక్ష ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కొరకు గత 14 రోజుల నుండి సమ్మెకు దిగడంతో జగదేవ్‌పూర్ మండలకేంద్రంలోని మండల వనరుల కేంద్రం మూతపడింది. దీంతో విద్యా శాఖకు సంబంధించిన అన్ని రకాల పనులు ఉద్యోగులు లేకపోవడంతో ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. ఎంఆర్‌సి కార్యాలయంలో పనిచేసే ఎంఐఎస్, సిసిఒ, సిఆర్‌పి, ఐఈఆర్‌పి, పిటిఐ, మెస్సెంజర్లు మూకుమ్మడిగా తమకు ఉద్యోగ భద్రత కల్పించాలనే డిమాండ్‌తో రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెకు వెళ్ళడం వల్ల విద్యార్థులకు అందించే రాగి జావ, మధ్యాహ్న భోజన బిల్లులకు సంబంధించిన వివరాలను పొందుపర్చడంలో ఉపాధ్యాయులకు అనేక ఇబ్బందులు కలుగుతున్నాయి. జిల్లాలో 919 మంది సమగ్ర శిక్షలో పనిచేస్తుండగా వీరంతా మూకుమ్మడిగా సమ్మెకు పోవడంతో విద్యా శాఖకు సంబంధించిన అన్ని పనులు నిలిచిపోయాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 22వేల మంది ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించి రెగ్యులర్ చేయాలని, అదేవిధంగా బీమా సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు సమగ్ర శిక్ష ఉద్యోగులు పేర్కొన్నారు.



ఉత్తమ మహిళ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

## ఉపాధ్యాయులు అంకిత భావంతో పని చేయాలి

### ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి

**సిద్దిపేట రూరల్, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త :** ఉపాధ్యాయులు అంకిత భావంతో పని చేసి విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్ది..సమాజానికి అందించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి అన్నారు. బుధవారం రాత్రి సిద్దిపేటలోని విపంచి అడిటోరియంలో సిద్దిపేట లయన్స్‌క్లబ్ అధ్వర్యంలో జిల్లా స్థాయిలో 20 మంది మహిళ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రతి యేటా లయన్స్‌క్లబ్ అధ్వర్యంలో రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక చేసి సన్మానాలు చేయడం సంతోషం ఉందన్నారు. తెలంగాణ బంగారు తెలంగాణగా మారాలంటే ఉపాధ్యాయులతోనే సాధ్యమవుతుందన్నారు. విద్యా వ్యవస్థ పటిష్టంగా ఉంటేనే అన్ని వ్యవస్థలు పటిష్టమవుతాయన్నారు. విద్యారంగ సమస్యలు, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఉపాధ్యాయులు సంతోషంగా ఉంటనే విద్యా బోధన సక్రమంగా జరుగు తుందన్నారు. సన్మానం పొందిన ఉపాధ్యాయులు అందరికీ అదర్శనీయులుగా నివాలన్నారు. మున్సిపల్ చైర్మన్ కడవెర్గు మంజుల రాజనర్సు,లయన్స్‌క్లబ్ నాయకులు లక్ష్మీ, అమర్‌నాథ్‌రావులు మాట్లాడారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు జ్యోతి, నిర్మల, రాణి, సుధారాణి, భాస్కర్, గంప రమేష్, వినోద్ మోదాని, నల్ల నాగరాజు, రమేష్, నారాయణ, సత్యం, వై.వి.సురేష్‌కుమార్, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, రాజబహదూర్‌రెడ్డి, జోజి, మాధవి, నర్సింహచారి, శ్రీధర్, భగవాన్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

## పచ్చదనం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

### -మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి



ప్రజలకు మొక్కలను పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి

**అమీన్‌పూర్, సెప్టెంబర్14 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తొమ్మిదో విడత హరితహారంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి కోరారు. గురువారం మున్సిపల్ పరిధిలోని 24వ వార్డు రాఘవేంద్ర కాలనీ, 12వ వార్డు జయలక్ష్మీ నగర్ కాలనీ, 10వ వార్డు సాయి కాలనీ, 9వ వార్డు ఐ.టీ. డబ్ల్యూ సిగ్నోడ్ కాలనీల్లో స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రజలకు మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత తొమ్మిది సంవత్సరాలుగా ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో హరితహారం కార్యక్రమం విజయవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించడంతో పాటు ఖాళీ స్థలాల్లో పచ్చదనం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరు మొక్కలు పెంచాలని విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ వ్యాప్తంగా ప్రతి కాలనీలో హరితహారం కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాల్లో కౌన్సిలర్లు కల్పన ఉపేందర్‌రెడ్డి, బోయిని బాలమణి బాలరాజు, ప్రమోద్ రెడ్డి, కొట్టూరు మల్లేష్, కవిత శ్రీనివాస్‌రెడ్డి, యూసుఫ్, కోఆప్షన్ సభ్యులు యూనుస్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దాస్ యాదవ్, చంద్రశేఖర్, చౌటకూరి మైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని పరార్శించిన శ్రీనివాస్ రెడ్డి



బాధిత కుటుంబాన్ని పరామర్శస్తున్న దృశ్యం

**దబ్బాక (అక్బర్‌పేటభూంపల్లి), సెప్టెంబర్ 14, ప్రభాతవార్త:** అక్బర్‌పేటభూంపల్లి మండల పరిధిలోని చిట్టాపూర్ గ్రామంలో సర్వయ్య గారి నర్సాగౌడ్ ఇటీవలే ఆనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ చెరుకు శ్రీనివాస్ రెడ్డి బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో అక్బర్‌పేటభూంపల్లి మండల ఉపాధ్యక్షుడు గజబింకర్ అశోక్, నగరం గ్రామ ఉపాధ్యక్షుడు రాములు, దుబ్బాక నియోజకవర్గ అసెంబ్లీ సోషల్ మీడియ కో ఆర్డినేటర్ ఉషయ్య, రాజిరెడ్డి, దుబ్బాక మున్సిపల్ సోషల్ మీడియ కో ఆర్టినేటర్ కర్ణంపల్లి రమేష్ గౌడ్, తదితరులు ఉన్నారు.

## నియామక పత్రం అందజేసి, శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే



**దబ్బాక (అక్బర్‌పేటభూంపల్లి), సెప్టెంబర్ 14, ప్రభాతవార్త:** నూతన మండలంగా ఏర్పాడిన అక్బర్‌పేట భూంపల్లి మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షులుగా బిజెపి సీనియర్ నాయకుడు అరిగే కృష్ణ ముదిరాజ్‌ని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందర్ రావు బుధవారం నియమించారు. పార్టీని క్రమ శిక్షణతో ముందుకు తీసుకెళ్లాలని, పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాల్సిందిగా కోరారు. ఈ సందర్భంగా అక్బర్‌పేట భూంపల్లి మండల అధ్యక్షుడు అరిగే కృష్ణ మాట్లాడుతూ తనపై నమ్మకంతో నూతనంగా ఏర్పాడిన అక్బర్‌పేట భూంపల్లి మండల అధ్యక్షునిగా నియమించినందుకు దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు కి కృతజ్ఞతలు తెలిపారు.

## మెడికల్ కాలేజీల ఏర్పాటు అద్భుతం: కరుణాకర్‌రెడ్డి

**మర్కుక్, సెప్టెంబర్ 14 (ప్రభాతవార్త):** తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాలలో మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేయడం మహా అద్భుతమని, సిఎం కెసిఆర్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావుల ప్రత్యేక చొరవతో కళాశాలలు ఏర్పాటు జరగడం సంతోషకరమని మర్కుక్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఒకేరోజు రాష్ట్రంలోని జిల్లా కేంద్రాలలో 9 వైద్య కళాశాలలను ప్రారంభించడం చరిత్రలో నిలిచిపోయే రోజన్నారు. తొమ్మిదిన్నరేళ్ళ కాలంలో మండలం అభివృద్ధిలో దూసుకుపోయిందని, ఆయా గ్రామాల్లో శరవేగంగా అభివృద్ధి జరిగిందంటే సిఎం కెసిఆర్ కృషి, హరీష్‌రావు సహకారం ఎంతో ఉందన్నారు. మర్కుక్ మండల అభివృద్ధి కోసం, అసంపూర్తిగా మిగిలిన పనులకు గానూ సుమారు రూ.4.58 కోట్లు, కుల సంఘాల భవన నిర్మాణాల కోసం రూ.3.70 కోట్లు మంజూర య్యాయని తెలిపారు. అలాగే నూతన చిన్న గ్రామపంచాయతీలకు 30 లక్షలు, మేజర్ పంచాయతీలకు రూ.50లక్షల చొప్పున నిధులు మంజూరైయాయి.

# రోడ్డు విస్తరణలో భూములు కోల్పోయిన రైతులు ఆందోళన చెందొద్దు

## చెక్కులతో పాటు ఇండ్ల నిర్మాణానికి స్థలాలు ఇస్తాం : ఎమ్మెల్యే మదన్‌రెడ్డి



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

**కొల్చారం, సెప్టెంబర్14 ప్రభాతవార్త:** మెదక్-హైదరాబాద్ జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతుల ఆందోళన చెందవద్దని, నష్టపరిహారం క్రింద చెక్కులతో పాటు ఇండ్ల నిర్మాణం కోసం స్థలాలు ఇస్తామని నర్సాపూర్ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని అప్పాజిపల్లి గ్రామంలో సర్పంచి చలం ఝాన్సీలక్ష్మీ యాదగిరి అధ్యక్షతన భూములు కోల్పోయిన రైతులతో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి సమావేశం అయ్యారు. రోడ్డు విస్తరణలో ఎంత మంది రైతులు భూములు కోల్పోయారో వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులు ఆందోళన చెందవద్దని వారికి భరోసా ఇచ్చారు. వారం రోజుల్లోగా అర్హులైన రైతులకు నష్టపరిహారం క్రింద చెక్కులతో పాటు ఇళ్ల నిర్మాణాల కోసం స్థలాలను కేటాయించాలని నర్సాపూర్ ఆర్డీవో శ్రీనివాస్, కొల్చారం తహాశీల్దార్ మహమ్మద్ గఫర్ మియాలను ఆదేశించారు. అలాగే గతంలో విమారయాత్రకు వెళ్లి కర్ణాకట రాష్ట్రంలో మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించుకోవడానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే వారి కుమారులు విద్యాశాఖలో ఔట్‌సోర్సింగ్ విధానంలో విధులు నిర్వహిస్తున్నారని, అయితే గత ఆరు నెలల నుండి వేతనం రావడ లేదని ఎమ్మెల్యే దృష్టికి తేగా ఆయన వెంటనే స్పందిస్తూ విషయాన్ని ఫోన్‌లో కలెక్టర్‌కు వివరించారు. త్వరలో వేతనం మంజూరయ్యేలా చూడాలని కలెక్టర్‌కు చెప్పారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఆర్డీవో శ్రీనివాస్, తహాశీల్దార్ మహమ్మద్ గఫర్ మియా, ఆర్ఐ ప్రభాకర్, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు రాంపల్లి గౌరీశంకర్‌గుప్త, అప్పాజిపల్లి సర్పంచి చలం ఝాన్సీ యాదగిరి, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు మన్సూర్, బీఆర్ఎస్ నాయకులు గజిని వెంకట్‌గౌడ్, కొమ్ముల యాదాగౌడ్, దేవన్నగారి శేఖర్, వడ్ల ప్రభాకర్, రవితేజారెడ్డి, ఆంజనేయులు, తుక్కాపూర్ సంతోష్‌రావు, విజయ్, రవిగౌడ్, దుర్గేష్‌గౌడ్, సోమ నర్సింలు, రవీందర్, గౌరీశంకర్, సొసైటీ చైర్మన్ చిన్నారం ప్రభాకర్, శివ్వన్నగారి ప్రశాంత్, సర్పంచి నెల్లి కిష్టయ్య, వైస్ ఎంపీపీ అల్లు మల్లారెడ్డి, ఏడుపాయల డైరెక్టర్ యాదాగౌడ్, సురేష్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.




ఉపాధ్యాయ రత్న అవార్డు అందుకుంటున్న దృశ్యం

## కుమార్‌కు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

**మిరుదొడ్డి, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన మిరుదొడ్డి గ్రామానికి చెందిన ధర్మారం కుమార్‌కు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. గురువారం హైదారాబాద్‌లోని శ్రీ పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయంలో బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్, కాళోజీ అవార్డు గ్రహీత జయరాజుల చేతుల మీదుగా తెలుగు భాష ఉత్తమ ఉపాధ్యాయ రత్న అవార్డును అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ తెలుగు భాష దినోత్సవం పురస్కరించుకొని హైదారాబాద్‌లోని ఉపాధ్యాయ రత్న అవార్డును అందజేయడం జరిగిందన్నారు. 15 యేండ్లుగా విద్యార్థులను ఉన్నతమైన పౌరులుగా తీర్చిదిద్దడంతో పాటు వివిధ సేవా కార్యక్రమాలను చేయడం వలన ఈ అవార్డును అందించారని తెలిపారు. తనకు ఈ అవార్డు రావడం పట్ల సమాజంలో మరింత బాధ్యత పెరిగిందన్నారు.

## బుడగజంగాలకు దళితబంధును అమలు చేయాలి



తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బుడగజంగాల నాయకులు

**వెల్దుర్తి, సెప్టెంబర్14 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కుకునూరు గ్రామంలో గల బుడగజంగాలకు సైతం దళితబంధును అమలు చేయాలని, లబ్ధిదారుల ఎంపికలో తమను సైతం చేర్చాలని బుడగజంగాల నాయకులు నర్సింలు, సుధాకర్‌ల ఆధ్వర్యంలో తహశీల్దార్ తులసీరామ్‌కు వినతిప్రతం అదజేశారు. గురువారం మండల కేంద్రమైన వెల్దుర్తిలో సుమారు వంద మంది బుడగజంగాల నాయకులు, యువకులు, మహిళలు తరలివచ్చి అంబేద్కర్ చౌరస్తా వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి తహశీల్దార్ తులసీరామ్‌కు వినతిప్రతం సమర్పించారు. ఈ సందర్భంగా బుడగజంగాల నాయకులు మాట్లాడుతూ తాము కుకునూరు గ్రామంలో నివాసం ఉంటున్నామని, తాము కూడా ఎస్సీల క్రిందకే వస్తామని, ప్రభుత్వం నుండి ఎస్సీ సర్టిఫికెట్లు పొందామని, తమకు సైతం దళితబంధు అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. కుకునూరు గ్రామానికి 17 దళితబంధు యూనిట్లు మంజూరయ్యాయని, దరఖాస్తుల సేకరణలో బుధవారం గ్రామంలో ఎస్సీలు, బడగజంగాలకు మధ్య ఘర్షణ చోటుచేసుకుందన్నారు. తమపై ఎస్సీలు దాడి చేశారని, అయినప్పటికీ తాము ఓపికతో ఉన్నామని, అధికారులు స్పందించిన తమకు దళితబంధు అమలు చేయాలన్నారు. గ్రామ సర్పంచి ప్రీతి మహేందర్‌రెడ్డి, జెడ్పీటీసీ రమేష్‌గౌడ్, గ్రామ కార్యదర్శి చంనరదశేఖర్‌లు రైతువేదిక వద్దకు రమ్మన్నారని, మీకు సైతం దళితబంధు వర్తిస్తుందని చెప్పడంతో వెళ్లడం జరిగిందన్నారు. అధికారులు పూర్తి విచారణ జరిపి దళితబంధును అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రామస్వామి, రాములు, సుధాకర్, నర్సింలు, యాదగిరి తదితరులు ఉన్నారు.

## నేడు మండల సర్వ సభ్య సమావేశం

**వెల్దుర్తి, సెప్టెంబర్14 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన వెల్దుర్తిలోని ఎంపీడీవో సమావేశ మందిరంలో శుక్రవారం మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించడం జరుగుతుందని ఎంపీపీ స్వరూప నరేందర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ స్వరూప నరేందర్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం జరుగుతుందని, సమావేశానికి అధికారులు సకాలంలో తగు నివేదికలతో రావాలన్నారు. ఈ సమావేశానికి నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి వస్తున్నట్లు వారు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని వారు కోరారు.

## ఎస్‌జిఎఫ్ క్రీడల్లో జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులు

**హుస్నాబాద్, సెప్టెంబరు14, ప్రభాతవార్త**

హుస్నాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక బాలుర పాఠశాలలో ఇటీవల నిర్వహించిన మండల స్థాయి ఎస్జీఎఫ్ క్రీడల్లో పట్టణంలోని కేరళా ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు అండర్ 14,17 కబడ్డీ,కోకో పోటీలలో ప్రతిభ కనపరచి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ బుర్ర రాజేందర్ తెలిపారు.జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులు సాత్విక్,రత్నకీర్తన,పవన్,రాజశేఖర్‌లను పాఠశాల కరస్పాండెంట్ అల్లి శైలేందర్,పిఈటి వంశీకృష్ణలతో కలసి అభినందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకబృథం పాల్గొన్నారు.

## కక్ష సాధింపు చర్యగా చంద్రబాబు అరెస్టు

### -తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ బత్తుల శ్రీనివాస్

**హుస్నాబాద్‌రూరల్,సెప్టెంబరు14,ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అరెస్టు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ కక్ష సాధింపు చర్య అని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ బత్తుల శ్రీనివాస్ మండిపడ్డారు.గురువారం రోజున చంద్రబాబునాయుడు అరెస్టును నిరసిస్తూ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దిస్టిబొమ్మను దగ్ధం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చార్జ్‌షీట్‌లో లేని చంద్రబాబునాయుడు పేరును చేర్చి అక్రమంగా అరెస్టు చేయించారన్నారు.జగన్ రాక్షస ఆనందానికి ఇది నిదర్శనమన్నారు.వెంటనే చంద్రబాబునాయుడు పై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేసి ఆయనను విడుదల చేయాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు వరియోగుల శ్రీనివాస్, వరుకోలు రవిందర్,సంజీవ్,శంకర్,వెంకటేష్, మహ్మద్‌షారుక్,భాస్కర్‌రెడ్డి, హసన్, సాయిలుతో పాటు తదితరులు పాల్గొన్నారు.



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి దిస్టిబొమ్మ దగ్ధం చేస్తున్న టిడిపి నాయకులు

## రైతులకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం : ఎమ్మెల్యే

**పెద్దశంకరంపేట, సెప్టెంబర్14 ప్రభాతవార్త:** రైతులకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం నారాయణఖేడ్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పెద్దశంకరంపేట మండలం బద్దారం గ్రామానికి చెందిన రనైతు మచ్కూరీ రమేష్ మృతి చెందడంతో అతడి భార్య సాయవ్వకు మంజూరైన రూ.5 లక్షల భీమా చెక్కును, అనంతరం మాద్చెట్‌పల్లికి చెందిన రుక్కమ్మకు రూ.1 లక్ష, టెంకటికి చెందిన సంగయ్యకు రూ.60 వేలు, గోపని వెంకటాపూర్‌కు చెందిన భూమాగౌడ్‌కు రూ.45 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెలేనయ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జంగం శ్రీనివాస్, జెడ్పీటీసీ విజయరామరాజు, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మురళీ పంతులు, ఎంపీటీసీ వీణ సుభాష్‌గౌడ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ సువర్ణ అంజయ్య, నాయకులు వీరాగౌడ్ తదితరులు ఉన్నారు.

## ఈవీఎంలపై ప్రజలకు అవగాహన

**పెద్దశంకరంపేట, సెప్టెంబర్14 ప్రభాతవార్త:** ఎన్నికల కమీషన్, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో ఓటర్లకు ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్నామని తహశీల్దార్ గ్రేసీబాయి గురువారం తెలిపారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో ఓటర్లకు ఈవీఎంల గురించి తెలుసుకోవడం, ఓటు వేయడం, వీవీ ప్యాట్స్ గురించి వివరించడం జరుగుతుందన్నారు. ప్రజలు ఈవీఎంలపై అవగాహన పెంచుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జంగం శ్రీనివాస్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మురళీ పంతులు, సీనియర్ నాయకులు ఆర్ఎన్. సంతోష్, సర్పంచులు అనంతరావు, సుధాకర్, ఆర్ఎస్ఐ శరణప్ప తదితరులు ఉన్నారు.

## స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ అవార్డుకు కొంగోడ్ ఎంపిక



మంత్రి దయాకర్‌రావు చేతుల మీదుగా స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ అవార్డును అందుకుంటున్న సర్పంచి మంజుల

**కొల్చారం, సెప్టెంబర్14 ప్రభాతవార్త:** కొంగోడ్ గ్రామం స్వచ్ఛ అవార్డుకు ఎంపిక కావడంలో గ్రామ ప్రజలు, అధికారుల కృషి మరువలేనిదని స్థానిక సర్పంచి కుకునూరి మంజుల సత్యనారాయణగౌడ్ అన్నారు. కొల్చారం మండలం కొంగోడ్ గ్రామ పంచాయితీ స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్-2023 అవార్డుకు ఎంపికైంది. ఈ అవార్డును హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్ర మంలో రాష్ట్ర పంచాయితీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చేతుల మీదుగా సర్పంచి మంజుల సత్యనారాయణగౌడ్ అందుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచి మంజుల సత్యనారాయణగౌడ్ మాట్లడుతూ ఈ అవార్డు ఎంపికలో స్థానిక ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, గ్రామ ప్రజలు, అధికారుల కృషి మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో శ్రీనివాస్, డీపీవో, ఎంపీడీవో గణేష్‌రెడ్డి, ఎంపీవో కృష్ణవేణి, పంచాయితీ కార్యదర్శి సౌజన్య తదితరులు పాల్గొన్నారు

## సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం : ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

**కొల్చారం, సెప్టెంబర్14 ప్రభాతవార్త:** సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం లాంటిదని నర్సాపూర్ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని పైతర గ్రామానికి చెందిన మిద్దె భానుకు సీఎంఆర్ఎఫ్ క్రింద మంజూరైన చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్‌రెడ్డి మాట్లాడుతూ సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం లాంటిదని అన్నారు. ఆరోగ్య సమస్యలతో పేద ప్రజలకు ఇబ్బందులు పడవద్దనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్నారన్నారు. పేదలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యనరకమంలో గ్రామ యువ నాయకులు యాబన్నగారి రవితేజారెడ్డి, కోఆప్షన్ సభ్యులు మన్సూర్, నర్సాపూర్ కౌన్సిలర్ అశోక్‌గౌడ్, దేవేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విశ్వకర్మల అభ్యున్నతి కోసం సిఎం కేసిఆర్‌నకృషి

**ములుగు, సెప్టెంబర్ 14 (ప్రభాతవార్త):** విశ్వకర్మ మనుమయ సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి పురస్కరించుకొని ఈనెల 17న గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో విశ్వకర్మ యజ్ఞం నిర్వహణ కొరకు బిఆర్ఎస్ రాష్ట్ర యువజన నాయకుడు జుబేర్ గురువారం ఆయన నివాసంలో విశ్వకర్మ సభ్యులకు రూ.21వేల విరాళం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర విమోచన దినోత్సవం రోజున విశ్వకర్మ యజ్ఞం నిర్వహించడం అభినందనీయమన్నారు. ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు విశ్వకర్మల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నారని, త్వరలో గజ్వేల్‌లో విశ్వకర్మల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించే శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంకు తనవంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వకర్మ మనుమయ సంఘం పట్టణ అధ్యక్షుడు గడిచారం వెంకటాచారి, ప్రధాన కార్యదర్శి విఠల్‌చారి, కోశాధికారి అరుణోజు లక్ష్మీనర్సింహ్మచారి, ఆర్‌అండ్‌ఆర్ కాలనీ పల్లెపహాడ్ మాజీ సర్పంచ్ శ్రీనివాసచారి తదితరులు పాల్గొన్నారు.

## గౌరవెల్లి ప్రాజెక్టుపై సిసి కెమెరాల ఏర్పాటుకు స్థల పరిశీలన

**అక్కన్నపేట, సెప్టెంబరు14, ప్రభాతవార్త**

గౌరవెల్లి ప్రాజెక్టులో భూములు కోల్పోయిన నిర్వాసితులు బద్దం భాస్కర్‌రెడ్డి,కొత్త సంజీవ్,సింగిరెడ్డి సురేదర్‌రెడ్డి,రాగి శివకుమార్‌లు ప్రాజెక్టులో భూములు కోల్పోయిన తమకు సరైన పరిహారం అందించకుండా ప్రభుత్వం కుట్ర పూరితంగా వ్యవహరిస్తూ తమ భూములను అక్రమంగా లాక్కు న్నారని వారికి న్యాయం చేయాలని కోరుతూ నేషనల్ గ్రీన్‌ట్రిబ్యూనల్‌లో కేసు వేయగా కోర్టు గోదావరి రివర్ మేనేజ్‌మెంట్, పర్యావరణశాఖకు తుది తీర్పు వెలువడేంత వరకు పనులు ఆపాలని ఆదేశించగా ఈ ప్రాజెక్టు కట్టపై గురువారం రోజున జిఆర్ఎంబి ఢిల్లీ, హైదరాబాద్ అధికారులు ప్రాజెక్టును సందర్శించి సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలో స్థలాలు చూసుకుని వెల్లారు.

## గజ్వేల్‌లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తాం : రాములుగౌడ్

**గజ్వేల్, సెప్టెంబర్ 14 (ప్రభాతవార్త):** వచ్చే సాధారణ ఎన్నికల్లో గజ్వేల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగురవేసి తీరుతామని కాంగ్రెస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్ పేర్కొన్నారు. గురువారం సిద్దిపేటలో పిసిసి రాష్ట్ర నాయకుడు, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్యను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో సిఎం కెసిఆర్ పాలన నియంత పాలనగా ఉందని ఎద్దేవ చేశారు.

## పథకాల పేరుతో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రజలను ప్రలోభాలకు గురి చేస్తున్నారు

**బెజ్జంకి, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త :** పథకాల పేరుతో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రజలను ప్రలోభాలకు గురి చేస్తూ ఓట్లను దండుకునేందుకు ప్రయత్నిస్తున్నారని బిఎస్‌పి నాయకులు పద్దెల్ల శ్రీనివాస్ యాదవ్ మండిపడ్డారు. గురువారం మండల కేంద్రంలో బిఎస్‌పి అధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన పేదలకు అందివ్వకుండా పార్టీ కార్యకర్తలకు, నాయకులకు అందిస్తున్నారని అరోపించారు. మండలంలో రోడ్లు, కల్వర్టులు మరమ్మత్తులకు నోచుకోకుండా అధ్వానంగా ఉన్నాయని నిత్యం గుంతల రోడ్లపైనే ప్రయాణిస్తున్న ప్రజాప్రతినిధులు, మండలాన్ని అభివృద్ధి చేశామని గొప్పలు చెప్పుకోవడం తప్ప ఒరగబెట్టిందేమిలేదన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పేదలకు అందించాలన్నారు. ముత్తన్నపేట గ్రామంలో తాగునీటి కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న పట్టించుకోవడం లేదన్నారు. ఎమ్మెల్యే బాలకిషన్ ముత్తన్నపేటలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు లింగాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు

**బెజ్జంకి, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త :** ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులను పారదర్శకంగా చేపట్టాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు పట్నం భూపాల్ అన్నారు. మండలలోని బెజ్జంకి క్రాసింగ్, దాచారం, వీరాపూర్, తోటపల్లి, లక్ష్మీపూర్, బేగంపేట, వడ్లూరు, బెజ్జంకి, కల్లెపల్లి, చీలాపూర్ పాఠశాలలో ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్య క్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సుదీర్ఘ కాలం అనంతరం జరుగుతున్న ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు పారదర్శ కంగా అందరికీ సమన్యాయం జరిగేలా అధికారులు చొరవ తీసుకోవా లన్నారు. ఉపాధ్యాయుల ఉమ్మడి సర్వీసు, సీనియారిటి దెబ్బతినకుండా చర్యలు చేపట్టాలన్నారు. పదోన్నతులలో నాట్ విల్లింగ్ అప్షన్ ఇవ్వడానికి సమ్మతించనందున ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పీఆర్‌సీ నియామకం చేసి ఐఅర్ ప్రకటించాలని సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్దీకరణ చేయాలన్నారు. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలన్నారు. గ్రామాలలోని పాఠశాలల్లో స్కావెంజర్స్‌ను నియమించాల న్నారు. కార్యక్రమంలో నాయకులు మ్యాడ శ్రీధర్, వడ్లకొండ శ్రీనివాస్, రామంచ రవీందర్, నారోజు శంకరాచారి, షాబుద్దీన్, ఉపాధ్యాయులు సుచరిత తదితరులు పాల్గొన్నారు.

## సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనంలో అపశృతి

### మున్సిపల్ చైర్మన్ మురళీ యాదవ్, ఎస్ఐ పోచయ్యకు గాయాలు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మురళీ యాదవ్

**మెదక్ అర్బన్, సెప్టెంబర్14 ప్రభాతవార్త:** బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దగ్ధం కార్యక్రమంలో అపశృతి చోటు చేసుకుంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అరెస్టును నిరసిస్తూ గురువారం మెదక్ జిల్లా కేంద్రంలో బీజేపీ శ్రేణులు సీఎం దిష్టిబొమ్మ దగ్ధం కార్యక్రమం నిర్వహించాయి. ఇందులో భాగంగా బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాందాస్ చౌరస్తా వద్ద ఆందోళన చేసిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు సీఎం కేసీఆర్ దిష్టి బొమ్మను దగ్ధం చేస్తున్న క్రమంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అక్కడే ఉన్న ఎస్ఐ పోచయ్య కాలుతున్న సీఎం దిష్టి బొమ్మను ప్రక్కకు జరిపే క్రమంలో కలెక్టరేట్ వైపు వెళ్తున్న బీజేపీ నేత, నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మురళీ యాదవ్‌పై పడింది. దీంతో మంట మీదికి రావడం చూసి చేతులు అడ్డుపెట్టడంతో చేతికి, ముఖానికి గాయాలయ్యాయి. పెట్రోల్ పోసి నిప్పు పెట్టడంతో భారీ మంటలు రావడం వల్ల మురళీ యాదవ్‌తో పాటు ఎస్ఐ పోచయ్యకు కూడా గాయాలయ్యాయి. అయితే ఎస్ఐ పోచయ్య నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని బీజేపీ నేతలు ఆరోపించారు. దగ్ధం చేసిన దిష్టిబొమ్మను వదిలి పెడితే పోయయేదని, అత్యుత్సాహంతో ప్రక్కకు పాడేయడం వల్ల ఈ ప్రమాదం జరిగిందని బీజేపీ నేతలు ఆరోపించారు.

## చాకరిమెట్ల దేవస్థానానికి రూ.13 లక్షల 58 వేల ఆదాయం

**శివ్వంపేట, సెప్టెంబర్14 ప్రభాతవార్త:** ఉమ్మడి మెదక్ జిల్లాలోనే ప్రముఖ పుణ్యక్షేత్రమైన శివ్వంపేట మండలం చిన్నగొట్టిముక్కుల గ్రామ పంచాయితీ పరిధిలోని చాకరిమెట్ల అటవీ ప్రాంతంలో వెలసిన శ్రీ సహకార ఆంజనేయ స్వామి దేవస్థానానికి 13,58,034 రూపాయల ఆదాయం హుండీ లెక్కింపు ద్వారా సమకూరింది. గురువారం దేవాదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమీషనర్ శివరాజ్, ఇన్స్‌పెక్టర్ రంగారావు, దేవస్థానం ఫౌండర్ చైర్మన్ ఆంజనేయ శర్మ, కార్యవ నిర్వాహణాధికారి శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఫౌండర్ చైర్మన్ ఆంజనేయ శర్మ, కార్య నిర్వహనాధికారి శ్రీనివాస్‌లు మాట్లాడుతూ సమకూరిన ఆదాయాన్ని శివ్వంపేట ఇండియన్ బ్యాంక్‌లో జమ చేస్తామని, ఈ ఆదాయాన్ని దేవస్థానం అభివృద్ధి కోసం వినియోగిస్తామని వారు మీడియాకు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి బాలమణి నరేందర్, ఎంపీటీసీ నువ్వుల దశరథ, ప్రధాన అర్చకులు దేవత్తు శర్మ, అర్చకులు ప్రభురాజ శర్మ, దేవిశ్రీ శర్మ, సిబ్బంది రామకృష్ణ, శ్రీనివాస్, ప్రకాష్ చారి, నాయకులు నారాయణరావు, పూల్‌సింగ్, హరిజా నాయక్, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ భగళాముఖి శక్తిపీఠంలో ప్రముఖుల ప్రత్యేక పూజలు

**శివ్వంపేట, సెప్టెంబర్14 ప్రభాతవార్త:** అమావాస్య పర్వ దినాన్ని పురస్కరించుకొని దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ ప్రాంతంలోని మెదక్ జిల్లా శివ్వంపేట మండల కేంద్రంలో నెలకొల్పిన అత్యంత శక్తిపీఠమైన శ్రీ భగళాముఖి బాలాలయం (శక్తిపీఠం)లో గురువారం పలువురు ప్రముఖులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే రాష్ట్ర మహిళా కమీషన్ చైర్ పర్సన్ సునితా లక్ష్మారెడ్డి, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబులు శ్రీ భగళాముఖి శక్తిపీఠాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. అంతకు ముందు వారికి శక్తిపీఠం ఉపాసకులు వెంకటేశ్వర శర్మ, ట్రస్టు సభ్యులు, స్థానిక జెడ్పీటీసీ సభ్యులు పబ్బా మహేష్‌గుప్త స్వాగతం పలకడం జరిగింది. మహేష్‌గుప్త వారితో పాటు దగ్గరుండి అన్ని ఏర్పాట్లు కల్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన ఉపాసకులు వెంకటేశ్వర్మ శర్మ ప్రముఖులు, ప్రజాప్రతినిధులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అమావాస్య కావడంతో వివిధ ప్రాంతాల నుండి పెద్దఎత్తున భక్తులు హాజరయ్యారు. హాజరైన వారందరికీ జెడ్పీటీసీ సభ్యులు మహేష్‌గుప్త దగ్గరుండి అన్నదాన వితరణ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు పబ్బా రమేష్‌గుప్త, సర్పంచి పత్రాల శ్రీనివాస్‌గౌడ్, ఉప సర్పంచి రాజిపేట పద్మ వెంకటేష్, సర్పంచులు గైనిబైటి శ్రీనివాస్‌గౌడ్, చంద్రకళ శ్రీశైలం యాదవ్, నాయకులు మర్రి మహేందర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## తెలంగాణ రైతాంగ పోరాట స్మృతి చిహ్నాలు ఏర్పాటు చేయండి

### ముఖ్యమంత్రి కేసీఆర్‌కు చాడ వెంకటరెడ్డి లేఖ

**హుస్నాబాద్‌రూరల్,సెప్టెంబరు14,ప్రభాతవార్త** రైతాంగ సాయుద పోరాటంలో ప్రాణాలు కోల్పోయిన వారి స్మృతి చిహ్నాలను హైదరాబాద్‌తో పాటు సాయుద పోరాటాలు జరిగిన ప్రాంతాలలో వెంటనే ఏర్పాటు చేయాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి గురువారం రోజున రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌కు లేఖ రాసారు.ఈ లేఖలో ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి పది సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటి వరకు మల్లారెడ్డిగూడెం,బొల్లెపల్లి,గుండ్రంపల్లి,బైరాన్‌పల్లి,మహ్మదాపూర్,కూటిగల్లు,కడివెండి పాలకూర్తి లాంటి అనేక రైతాంగ సాయుద పోరాటాల్లో ప్రజల తరుపున ఏర్పాటు చేసిన చిహ్నాలు శిథిలమౌతున్నాయని వెంటనే వాటికి మరమ్మత్తులు చేయడంతో పాటు హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై సైతం ఈ స్మృతి చిత్రాలు ఏర్పాటు చేసి సాయుద పోరాట చరిత్రను బావి తరాలకు అందించేందుకు ఈ పోరాటాలను పాఠ్యపుస్తకాలలో చేర్చాలని కోరారు.


వాల్ పోస్టర్లను విడుదల చేస్తున్న గీత కార్మికులు

## గీత కార్మికుల ధర్నాను జయప్రదం చేయాలి

**చేర్యాల, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త :** కల్లుగీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 22న ఇందిరా పార్కు వద్ద జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని కల్లు గీత కార్మిక సంఘం సిద్దిపేట జిల్లా కార్యదర్శి బండకింది అరుణ్‌గౌడ్ తెలిపారు. స్థానిక పట్టణంలోని రేణుక ఎల్లమ్మ గుడి ఆవరణలో చేర్యాల గౌడ సంఘం అధ్యక్షుడు అంబాల బుచ్చిరాములు అధ్యక్షతన జరుగా ముఖ్యతిథిగా అరుణ్ పాల్గొని నాయకులతో కలిసి పోస్టర్లను ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో చెక్కిళ్ళ కనకయ్య, అంబాల నాగులు, పచ్చిమడ్ల వెంకటయ్య, బొంగోని భాస్కర్, బుడిగె వెంకటేష , గుడాల గణేష్, బూరగోని శ్రీనివాస్, పచ్చిమడ్ల సిద్దిరాములు, బుడిగే శ్రీనివాస్, మూషిని భాస్కర్, కొంతం శ్రీహరి, బండి గోపాల్, పచ్చిమడ్ల శ్రీనివాస్, అంబాల రాములు, బుడిగె రమేష్, సత్యనారాయణ, విజయ్, పచ్చిమడ్ల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## అధికారపార్టీ నాయకులు ప్రాంత ద్రోహులుగా మిగిలి పోవద్దు


నాయకులకు కండువాలు కప్పుతున్న చైర్మన్ పరమేశ్వర్

**చేర్యాల, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త :** చేర్యాల డివిజన్ సాధన కోసం జేఏసి నాయకులు చేస్తున్న దీక్షలు గురువారం 4వ రోజుకు చేరుకుంది. దీక్షల్లో మద్దూరు మండల నాయకులు కూర్చోగా జేఏసి చైర్మన్ డాక్టర్ రామగల్ల పరమేశ్వర్ వారికి కండువాలు కప్పి దీక్షను ప్రారంభించారు. అనంతరం జేఏసి నియోజకవర్గ, కాంగ్రెస్ నాయకుడు రామడుగు బాలరాజు పాల్గొని మాట్లాడుతూ చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధన ఉద్యమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు కలిసి రాకుంటే ఈ ప్రాంత ద్రోహులుగా మిగిలిపోతారని అన్నారు.

### దీక్షలకు సంఘీభావం తెలిపిన విశ్రాంత ఉపాధ్యాయులు

జేఏసి రిలే నిరాహార దీక్షలకు విశ్రాంత ఉపాధ్యాయుల సంఘం నాయకులు సంఘీభావం తెలిపారు. సంఘం అధ్యక్షులు రఘుపతిరెడ్డి, రాజ మల్లయ్య, పోలోజు వెంకటాద్రి, గుస్క రామదాసు, ఎనమల్ల సుదర్శన్, గుస్క గాలయ్య ఉన్నారు.

## చేర్యాలలో ఘనంగా పోషణ మాసోత్సవాలు


గర్భిణీల, బాలింతలతో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ స్వరూపారాణి

**చేర్యాల, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త :** చేర్యాల పట్టణంలోని 12వ అంగన్‌వ్వాడి సెంటర్లో పోషణ మాస ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యతిథులుగా చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి, వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, కౌన్సిలర్లు ఆడెపు నరేందర్, ఇన్నమ్మ, తుమ్మలపల్లి లీల పాల్గొని మాట్లాడుతూ గర్భిణీస్త్రీలు, బాలింతలు సరైన పోషణ ఆహారం తీసుకోవాలని సూచించారు. అంగన్‌వ్వాడి కేంద్రాల్లో సమతుల్యమైన ఆహారాన్ని అందించేందుకు విటమిన్లు కలిగిన ఆహారాన్ని ప్రభుత్వం అందిస్తుందన్నారు. గర్భిణీలు, బాలింతలు అంగన్‌వ్వాడీ, వైద్య సిబ్బంది సలహాలు, సూచనలు తప్పక పాటించాలని వారు స్పష్టం చేశారు. అనంతరం వారి చేతుల మీదుగా సీమంతాలు, అక్షర అభ్యాసం, అన్నప్రాసనాలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యధికారులు భాగ్యలక్ష్మి, ఐసిడిఎస్ సూపర్వైజర్ తలారి నాగమణి, కనకరాజు, ఏఎస్ఎం, అంగన్‌వాడి టీచర్ క్రిష్ణవేణి, ఆయా సెంటర్ల అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

### ఎంపిడీవో భవనాన్ని స్వాధీనపరుచుకున్న కోర్టు అధికారులు


కోర్టు అధికారులకు పత్రాన్ని అందిస్తున్న ఎంపిపి కరుణాకర్

**చేర్యాల, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త :** చేర్యాల పట్టణానికి ఇటివల మున్సిఫ్‌కోర్టును ప్రభుత్వం మంజూరు చేసిన విషయం విధితమే. కోర్టు ఏర్పాటు కోసం ప్రతిపాధించిన ఎంపిడీవో భవనాన్ని బుధవారం సాయంత్రం సిద్దిపేట జిల్లా కోర్టు అధికారులు స్వాధీన పరుచుకున్నారు. జిల్లా కోర్టు ప్రధాన అడ్మిన్‌స్ట్రేటివ్ అధికారి ఎం.సూర్యనారాయణ మూర్తి, జిల్లా కోర్టు అడ్మిని స్ట్రేటివ్ అధికారి రవీందర్, సూపరిండెంట్ శ్రీధర్, ఎంపిపి ఉల్లంపల్లి కరుణాకర్, చేర్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షులు భూమిగారి మనోహార్, తాటికొండ ప్రణీత్, అంకని సురేందర్, పొన్నం సురేష్ తదితరులు ఉన్నారు. ఇప్పటి వరకు కొనసాగున్న ఎంపిడీవో కార్యాలయ భవనాన్ని కోర్టు అధికారులు స్వాధీనం చేసుకోగా, కార్యాలయ సేవలు తత్కాలికంగా పక్కనే ఉన్న ఐకెపి భవనంలోకి మార్చినట్లు ఎంపిపి ఒక ప్రటనలో తెలిపారు. ఎప్పటిలాగే యధావిధిగా పనులు కొనసాగుతాయన్నారు.

### ఉద్యోగాలను క్రమబద్దీకరించాలని వినతిపత్రం అందజేత

**చేర్యాల, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త :** జిల్లాలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు గురువారం రాష్ట్ర జేఏసి పిలుపు మేరకు తమ ఉద్యోగాలను క్రమబద్దీకరించాలని కోరుతూ మండల కేంద్రంలోని గురుకుల పాఠశాల, కళాశాల జిల్లా కో ఆర్టినేటర్ బి.అశోక్ బాబుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రభుత్వం తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరారు.



వినతి పత్రం అందిస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు


బంద్ నిర్వహిస్తున్న సర్పంచి వర్గం సభ్యులు

## పట్టణ బంద్ ప్రశాంతం.. పాల్గొన్న పట్టణ వాసులు

**చిన్నశంకరంపేట, సెప్టెంబరు 14, ప్రభాతవార్త:** చిన్నశంకరంపేట సర్పంచి రాజిరెడ్డిపై తప్పుడు కేసులు బనాయించారని ఆరోపిస్తూ ఆ వర్గం సభ్యులు గురువారం నాడు పట్టణ బందుకు పిలుపునిచ్చారు. ఉదయం నుండి దుకాణాలను మూసివేయించి ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు రాజుకు వ్యతిరెఖంగా నినాదాలు చేశారు. అంబాజీపేట గ్రామానికి చెందిన దోకి లక్ష్మీ తన వ్యవసాయ భూమిని రాజిరెడ్డి భాగ్యనగరంలోని వ్యాపారులకు తన ప్రమేయం లేకుండా కట్టబెట్టారనే మనో వేదనతో ఆమె గుండెపోటుతో చనిపోయిందని ఆరోపిస్తూ కుటుంబసభ్యులు మెదక్-చేగుంట రహదారిపై రస్తారోకో చేపట్టగా రాజిరెడ్డిపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసిన విషయం విదితమే. ఈ మేరకు పట్టణ దుకాణదారులు స్వచ్ఛందంగా బందులో పాల్గొని రాజిరెడ్డికి మద్దతు తెలిపారు. పట్టణ సర్పంచి రాజిరెడ్డిని ఉద్దేశపూర్వకంగానే భారాస పార్టీ మండలాధ్య క్షుదు రాజు బాధిత కుటుంబాన్ని ప్రలోభాలకు గురిచేశాడని, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, పట్టణ మాజీ సర్పంచి శ్రీమన్నారయణ రెడ్డి ఆరోపించారు. ఈ విషయంలో పట్టణ సర్పంచి రాజిరెడ్డికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. అంబాజీపేట ప్రజలు వాస్తవాలను గమనించాలన్నారు.

## బంద్‌కు తరలివెళ్లిన కాంగ్రెస్ శ్రేణులు


మెదక్ బంద్‌కు తరలివెళ్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

**చిన్నశంకరంపేట, సెప్టెంబరు 14, ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంలో వైద్యాకళాశాల ఏర్పాటు చేయడంలో ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ గురువారం టీపీసీసీ కార్యదర్శి మ్యాడం బాలక్రిష్ణ మెదక్ బందుకు పిలుపు నివ్వగా చిన్నశంకరంపేట నుండి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. వైస్ ఎంపీపీ సత్యంగౌడ్, ఎంపీటీసీ శివకుమార్, ప్రసాద్‌గౌడ్‌లు, అశోక్ నాయక్ వివిధ గ్రామాల కార్యకర్తలు పాల్గొన్నారు.

## రేణుక ఎల్లమ్మ ఆలయంలో చోరీ


సూరారంలో చోరీ జరిగిన రేణుక ఎల్లమ్మ అమ్మవారి ఆలయం

**చిన్నశంకరంపేట, సెప్టెంబరు 14, ప్రభాతవార్త:** గుర్తు తెలియని దుండగులు ఆలయంలోని హుండిలోని నగదును ఎత్తుకెళ్లిన సంఘట మండల పరిధి సూరారంలో చోటు చేసుకుంది. గ్రామంలో ఉన్న రేణుక ఎల్లమ్మ దేవాలయంలో ఉదయం దుర్గాగౌడ్ పూజలు నిర్వహించడానికి వెళ్లారు. ఆలయ ఆవరణలో ఉన్న అమ్మవారి హుండిలోని నగదు కనిపించలేదు. పగిలిపోయిన హుండి తాళాలు అక్కడ పడి ఉన్నాయని, గుర్తు తెలియని దుండగలు హుండిలోని నగదును తీసుకొని పరారయ్యారని ఆయన తెలిపారు. అందులో సుమారు నాణాలు, డబ్బులు కలిసి 5వేల రుపాయల వరకు ఉంటాయని వారు తెలిపారు. ఈ విషయమై చిన్నశంకరంపేట ఎస్ఐ నారాయణ గౌడ్‌ను వివరణ అడుగగా ఫిర్యాదు అందలేదన్నారు.

## నర్సాపూర్‌లో బిసి బంధు చెక్కుల పంపిణీ


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి తదితరులు

**నర్సాపూర్, సెప్టెంబర్ 14.ప్రభాతవార్త:** ఈనెల 16 న శనివారం నర్సాపూర్‌లో బిసి బంధు పథకం కు సంబంధించిన మంజూరైన చెక్కుల పంపిణీ కార్యక్రమం ను నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే సిహెచ్ మదన్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన నర్సాపూర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోస్థానిక విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాల్లో ఉన్న కులవృత్తుల వారికి సంబందించిన బిసి బంధు పథకం కింద మంజూరైన లబ్దిదారులకు ఈనెల 16 న నర్సాపూర్‌లోని సాయికృష్ణా పంక్షన్‌హాల్‌లో బిసి బంధు చెక్కులను పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ పరిధిలోని బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు, బిసి నాయకులు, బిసి బంధులో మంజూరైన లబ్దిదారులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి పిలుపునిచ్చారు. నర్సాపూర్ ఎమ్మెల్యే టికెట్టు పై ఆయన మాట్లాడుతూనర్సాపూర్ బిఆర్ఎస్ పార్టీ తరపున ఎమ్మెల్యే టికెట్టు తనకే వస్తుందన్నా నమ్మకం ఉందన్నారు. ఇందులో ఎలాంటి సందేహం లేదన్నారు. అదేవిదంగా రానున్న అసెంబ్లీ ఎన్నికల బరిలో నర్సాపూర్ ఎమ్మెల్యే గా బరిలో ఉంటానన్న ధీమాను ఆయన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర లేబర్ వేల్ఫేర్ బోర్డు చైర్మన్ దేవేందర్‌రెడ్డి, జిల్లా కోఆప్షన్ సభ్యులు మన్సూర్, పిఏసిఎస్ చైర్మన్ రాజుయాదవ్, ఎంపిపి ఉపాధ్యక్షులు వెంకట నర్సింగరావు, కౌడిపల్లి మండల బిఆర్ఎస్ అధ్యక్షులు సారా రామాగౌడ్, శివ్వంపేట మండల బిఆర్ఎస్ అధ్యక్షులు రమణగౌడ్, నాయకులు సుధీర్‌రెడ్డి, కుమ్మరి నాగేశ్, కమ్మరి కృపాచారి, ఆంజనేయులుగౌడ్, జంగం వెంకటేశ్, దావూద్, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి ఆధ్వర్యంలో కెసిఆర్ దిష్టిబొమ్మ దహనం

**సిద్దిపేట రూరల్, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త :** కేంద్ర మంత్రి, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి అరెస్టు అప్రజాస్వామికమని తెలంగాణలో నియంత పాలన కొనసాగుతుందని బిజెపి జిల్లా అధ్యక్షులు దూది శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం శాంతియుతంగా 24 గంటల నిరుద్యోగ దీక్ష చేస్తున్న బిజెపి రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డిని ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేసి దీక్ష భగ్నం చేసినందుకు నిరసనగా గురువారం సిద్దిపేటలోని బిజెఆర్ చౌరస్తాలో సిఎం కెసిఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. పార్టీ నాయకులు ఉపేందర్‌రావు, శ్రీనివాస్ యాదవ్, గుండ్ల జనార్ధన్, వేణుగోపాల్, తొడుపునూరి వెంకటేశం, గోనె మార్కండేయులు, సత్యనారాయణ, అంబటిపల్లి శ్రీనివాస్, దినేష్, శ్రీనివాస్‌రెడ్డి, కనకరాజు, శ్రీనివాస్, కృష్ణ, భోగి శ్రీనివాస్, పద్మ, సుగుణ, లత తదితరులు పాల్గొన్నారు.


సిఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బిజెపి నాయకులు


వారోత్సవాల్లో పాల్గొన్న ఎంపీపీ కల్లూరి అనితశ్రీనివాస్

## కొత్తపల్లిలో పోషకాహార వారోత్సవాలు

**రాయపోల్, సెప్టెంబర్14 ప్రభాతవార్త :** రాయపోల్ మండల వ్యాప్తంగా పోషకాహార వారోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ నెల 1నుంచి 30 వరకు మండల వ్యాప్తంగా నిర్వహిస్తున్న పోషకాహార వారోత్సవాల సందర్భంగా గురువారం రాయపోల్ మండల పరిధిలోని కొత్తపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గర్బిణీలు, బాలింతలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ కల్లూరి అనిత శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గర్బిణీలు, బాలింతల్లో పోషకాహార విలువలను పెంపొందించేందుకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని విధిగా తీసుకోవాలని సూచించారు. ప్రధానంగా మనం తీసుకునే ఆహారంలో ప్రోటిన్స్ ఎక్కువగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ మన్నె రంగమ్మ, ఏఎన్ఎం ప్రేమ, ఆశవర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు అలివేలు మంగ, కవిత తదితరులు పాల్గొన్నారు

## అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు


మంతూర్‌లో బాపురెడ్డి అంత్యక్రియల్లో పాల్గొన్న దృశ్యం

**రాయపోల్, సెప్టెంబర్15 ప్రభాతవార్త :** కార్యర్తలకు ఎల్లప్పుడు అండగా ఉంటానని దుబ్బాక ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. గురువారం రాయపోల్ మండల పరిధిలోని మంతూర్ గ్రామంలో బిజెపి గ్రామ అధ్యక్షులు గోరె బాపు రెడ్డి మృతి చెందాడు విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు బాపు రెడ్డి అంతక్రియల్లో పాల్గొన్నారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ..బాపురెడ్డి మృతి చెందాడం చాలా బాధకరమని, వారి కుటుంబానికి బిజెపి పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని అన్నారు. ఆనంతరం రాంసాగర్‌లో వీరాచారి తల్లీ మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేసారు. ఎమ్మెల్యే వెంట బిజెపి మండల అధ్యక్షులు మాదాసు వెంకట్‌గౌడ్, సీనియర్‌నాయకులు రాజాగౌడ్, జిల్లా ఎస్సీ మోర్చ అధ్యక్షులు మంకిడి స్వామి, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కొతిండ్ల సత్యం, గజ్వేల్ రాంచంద్రం, వెంకట్‌గౌడ్, క్రిష్ణాగౌడ్, మంతూర్ ప్రభాకర్‌రెడ్డి, హరికృష్ణ గౌడ్, నరేష్‌గౌడ్, సమరేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## హనుమాన్ ఆలయంలో అమావాస్య అన్నదానం


ప్రసన్నాంజనేయస్వామికి పూజా కార్యక్రమం నిర్వహిస్తున్న అన్నదాతలు వంజరి సుమలత శ్రీనివాస్ దంపతులు

**నర్సాపూర్, సెప్టెంబర్ 14.ప్రభాతవార్త:** బహుళ అమావాస్య ను పురస్కరించుకొని నర్సాపూర్ పట్టణంలోని బస్టాండ్ హనుమాన్ ఆలయంలో గురువారం అమావాస్య అన్నదానం కార్యక్రమం మరియు శ్రీ ప్రసన్నాంజనేయస్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ ఆలయంలో పూజా కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమాలు అన్నదాతలు ఎల్ఐసి ఎజెంట్ వంజరి సుమలత శ్రీనివాస్ దంపతుల అధ్వర్యంలో నిర్వహించగా వేద పండితులు ఆలయ పూజారి హరిప్రసాద్‌శర్మ వేద మంత్రోచ్ఛరణల మధ్యన శ్రీ ప్రసన్నాంజనేయస్వామికి అభిషేకం, పంచామృతాబిషేకం, సింధూర లేపనం, ప్రత్యేక పూజలు నవగ్రహాల పూజ, వినాయక పూజ, శివపూజా ,హరతి వంటి కార్యక్రమాలను నియమ నిష్టలతో, భక్తి శ్రద్దలతో నిర్వహిం చడం జరిగింది. అనంతరం శ్రీ ప్రసన్నాంజనేయస్వామి భజన మండలి కళాకారులుచే భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు హరిప్రసాద్‌శర్మ అమావాస్య అన్నదాన కార్యక్రమంపై దాని విశిష్టత గురించి ప్రవచనాలు వినిపించారు. అటుతర్వాత మధ్యాహ్నం అన్నదాతలు ఎల్ఐసి ఎజెంట్ వంజరి సుమలత శ్రీనివాస్ దంపతుల అధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించగా భక్తులు, ప్రజలు ఈ అన్నదాన కార్యక్రమంలో పాల్గొని అన్నదానాన్ని స్వీకరించారు. ఈకార్యక్రమంలోవేద పండితులు హరిప్రసాద్‌శర్మ తో పాటు అన్నదాతలు ఎల్ఐసి ఎజెంట్ వంజరి సుమలత శ్రీనివాస్ దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు కుమ్మరి సంజీవ్, కుమ్మరి జ్ఞానేశ్వర్, సదానందం, గోపాల్, మణికంట వెంకటేశంగుప్త, రేగన్‌నా యుడు, గొల్లసత్తయ్యయాదవ్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఐసిడిఎస్‌ను ముట్టడించిన అంగన్‌వాడీ ఉద్యోగులు


ఐసిడిఎస్ కార్యాలయాన్ని ముట్టడించిన దృశ్యం

**నర్సాపూర్, సెప్టెంబర్ 14.ప్రభాతవార్త:** అంగన్‌వాడి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తు నర్సాపూర్‌లో అంగన్‌వాడి ఉద్యోగుల సమ్మె గురువారం నాలుగవ రోజుకు చేరింది. ఈ అంగన్‌వాడి ఉద్యోగుల సమ్మెలో బాగంగా గురువారం నర్సాపూర్‌లోని ఐసిడిఎస్ కార్యాలయాన్ని ముట్టడి కార్యక్రమం ను నిర్వహించారు. ఈ ముట్టడి కార్యక్రమంలో ఐసిడిఎస్ నర్సాపూర్ ప్రాజెక్ట్ పరిధిలోని అన్ని గ్రామాల అంగన్‌వాడి టీచర్లు, ఆ యాలు తరలివచ్చి నర్సాపూర్ పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయం ముందు భైఠాయించారు. ఈసందర్భంగా అంగన్‌వాడి టీచర్లను పర్మినెంట్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని. 26 వేల వేతనం ఇవ్వాలంటూ వారు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు మహేందర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కడారి నాగరాజులు మాట్లాడుతూ గత నాలుగు రొఓజులుగా అంగన్‌వాడి ఉద్యోగులు నిరవధిక సమ్మె ను చేస్తుంటే బిఆర్ఎస్ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లైనా లేదన్నారు. ఈమేరకు అంగన్‌వాడి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేంత వరకు ఈ సమ్మె కొనసాగిస్తామని ఈ ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలోఅంగన్‌వాడి టీచర్లు అన్నపూర్ణ, విజయ, వరలక్ష్మి, ఫారిధా , సువర్ణ, ధనలక్ష్మి, విజయ, మంజుల, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

### బాధిత కుటుంబానికి పరామర్శ

**మిరుదొడ్డి, సెప్టెంబర్14, ప్రభాతవార్త :** మండల పరిధిలోని కొండాపూర్ గ్రామానికి చెందిన యాదగౌడ్ అనారోగ్యంతో మరణించగా ఈ విషయం తెలుసుకున్న దుబ్బాక కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. అయన వెంట పార్టీ నాయకులు మద్దెల రాజేశం, ఎర్రళ్ల రాజు, ఊషయ్యగారి రాజిరెడ్డి, ప్రశాంత్ తదితరులు ఉన్నారు.


ట్రైడెంట్ చక్కర కంపెని ఎండి రామనాథ్‌ను నిలదీస్తున్న వసంత్

## ట్రైడెంట్ చక్కర కంపెని ఎండిని నిలదీసిన ఢిల్లీ వసంత్

**జహీరాబాద్, సెప్టెంబరు 14, ప్రభాతవార్త:** మండలంలోని కొత్తూర్ (బి) గ్రామంలోని ట్రైడెంట్ చక్కర కర్మాగార ఎంపి రామనాథ్‌ను సామాజిక ఉద్యమ కారుడు ఢిల్లీ వసంత్ గురువారం నిలదీశారు. గురూరం కర్మాగార ఎండి రామనాథ్ కర్మాగారానికి వచ్చినట్లు తెలుసుకున్న ఢిల్లీ వసంత్ కార్మాగారానికి తన బృంధం సభ్యులతో చేరుకుని రైతులకు బిల్లులు పెండింగ్‌లో పెట్టడం ఏమి టని ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఎండి రామనాథ్ స్పందిస్తూ రాష్ట్ర ఆర్థిక మంత్రి తన్నీరు హరీష్‌రావుకు చేసిన హామి మేరకు ఈ నెల 20వ తారీఖు లోపు రైతులకు బకాయి బిల్లులు చెల్లిస్తామని హామి చేసినట్లు ఢిల్లీ వసంత్ పేర్కొన్నారు. క్రషింగ్ ఏర్పాటుకు అవసరమైన చర్యలకు శ్రీకారం చుట్టినట్లు ఎండి వివరించారన్నారు. కూలీల కొరత అధికంగా ఉందని, అందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి రైతులకు ఆదుకోవాల్సిన అవసరం ఉందని ఎండి దృష్టికి తెచ్చామన్నారు. భవిష్యత్తులో ఇథనాల్ ప్లాంటు విస్తరణకు ప్రయత్ని స్మాని పేర్కొన్నారన్నారు. కార్యక్రమంలో రైతు నాయకులు మైపాల్ యాదవ్, మాధవరెడ్డి, రాములు నేత, గోవింద్‌రెడ్డి, రహీం ఖురేషి, సంజీవ్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## నిరాహార దీక్షలను ప్రారంభించిన ఎంఆర్‌పిఎస్ నాయకులు


నిరాహార దీక్షలో పాల్గొన్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

**జహీరాబాద్, సెప్టెంబరు 14, ప్రభాతవార్త:** ఈ నెల 18వ తారీఖు నుంచి ఆరంభం అయ్యే పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లులు సభలో పెట్టాలని డిమాండ్ చేస్తూ గురువారం నుంచి ఎంఆర్‌పిఎస్ నాయకులు నిరాహార దీక్షలకు పూనుకున్నారు. ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు జిల్లా కన్వీనర్ అబ్రహం మాదిగ ఆధ్వర్యంలో పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం మందు నాయకులు నిరాహార దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పిఎస్ జాతీయ ప్రతినిధి బుర్ర బిక్షపతి మాదిగ, జిల్లా కన్వీనర్ మాతంగి చిరంజీవి మాదిగలు మాట్లాడుతూ గురువారం నుంచి ప్రారంభమైన నిరాహార దీక్షలను ఈ నెల 22వ తారీఖు వరకు కొనసాగిస్తామన్నారు. పార్లమెంట్ సమావేశంలో ఎస్సీ వర్గీకరణ బిల్లును పెట్టి వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. బిజెపి చేసిన హామీని అమలు చేసి తమ మాటను నిలుపుకోవాలని హితువు పలికారు. దీక్షా శిబిరాన్ని ప్రముఖ న్యాయవాది అలిగె సందీప్ కుమార్, జహీరాబాద్ బార్ అసోసియేషన్ కార్యదర్శి కూనదొడ్డి నవీన్ కుమార్, నియోజకవర్గ ఎంజెఎఫ్ ఉపాధ్యక్షులు, కాంగ్రెస్ యువ నాయకులు బి సుధీర్, అఖిల్, వంశీ, విష్ణువర్ధన్‌రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు జె జయరాజ్ తదితరులు సంఘీబావం తెలిపారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ జిల్లా కన్వీనర్ అబ్రహం మాదిగ, నాయకులు ఉల్లాస్ మాదిగ, ఆగస్టీన్, పి సుకుమార్, మనోజ్, మహేష్, బన్ని తదితరులు పాల్గొన్నారు.

## కేసిఆర్ కాలనీలో రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలి


తహసీల్దార్‌కు వినతి పత్రం అందచేస్తున్న దృశ్యం

**రామాయంపేట, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:** రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని కేసీఆర్ కాలనీ డబుల్ బెడ్‌రూం వద్ద రేషన్ షాపు కోసం సంబంధిత తహసీల్దార్ రజనీకుమారిని గురువారం నాడు కలిసి అక్కడి కాలనీ ప్రజలు వినతి పత్రం అందించారు. కాలనీలో నివాసం ఉంటున్న ప్రజలు ఇబ్బందుల దృష్ట్యా రోడ్డు దాటడం కష్టంగా ఉందని, ఎమ్మార్వోకు తెలియ చేశారు. దాంతో పాటు మేడ్చల్ డిపోకు చెందిన బస్సులను బైపాస్ నుంచి కాకుండా కేసీఆర్ కాలనీ మీదుగా ఒక స్టాప్ నిర్వహించి తీసుకెళ్లాలని డిపో మెనేజర్ సుధాకర్‌తో మాట్లాడారు. మేనేజర్‌కు వినతి పత్రాన్ని ఫాక్స్ ద్వారా పంపారు. బస్సు ఆపడం విషయం గురించి ఎమ్మార్వోకు కూడ వినతి పత్రం అందించారు.

## 17న శ్రీవిరాట్ విశ్వకర్మ జయంతి ఉత్సవాలు

**నర్సాపూర్, సెప్టెంబర్ 14.ప్రభాతవార్త:** నర్సాపూర్‌లో ఈ నెల 17 న విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మనుమయ సంఘం నర్సాపూర్ అధ్వర్యంలో నర్సాపూర్ మెదక్ ప్రధాన రహదారిలోగల చిన్నచింతకుంట బస్టాప్ వద్ద పెద్దచింతకుంట గ్రామ శివారులోని శ్రీ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో శ్రీ విరాట్ విశ్వకర్మ జయంతి యజ్ఞ హోమం ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు నర్సాపూర్ విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మనుమయ సంఘం నర్సాపూర్ పట్టణ అధ్యక్షులు వడ్ల నరెందర్ చారి, పట్టణ ప్రధాన కార్యదర్శి వడ్ల కాళీదాస్‌చారి, జిల్లా ప్రధాన కార్యదర్శి కమ్మరి కృపాచారి, శ్రీ విశ్వకర్మ జయంతి యజ్ఞ మహోత్సవ కమిటీ అధ్యక్షులు వడ్ల నరేందర్‌చారిలు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. శ్రీ విరాట్ విశ్వకర్మ జయంతి యజ్ఞ హోమం ఉత్సవ కార్యక్రమంలో బాగంగా ఈ నెల 17 న ఉదయం వేద పారాయణం, మంగళవాయిధ్యాలు, జ్యోతి ప్రజ్వళన, పుణావాచనమ్, శ్రీ విశ్వకర్మ జెండావిష్కరణ, నర్సాపూర్ పట్టణంలో శ్రీ విశ్వకర్మ బగవానుడి ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహిస్తుండగా శ్రీ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో శ్రీ విరాట్ విశ్వకర్మ బగవానుడికి ప్రత్యేక పూజలు యజ్ఞ హోమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈమేరకు శ్రీ విరాట్ విశ్వకర్మ జయంతి యజ్ఞ హోమం ఉత్సవ కార్యక్రమంలో జరిగే పూజా కార్యక్రమాలకు నర్సా పూర్ పట్టణంతో పాటు పరిసరా గ్రామాల ప్రజలు భక్తులు విశ్వబ్రా హ్మణులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించి: ఎమ్మెల్యే

**తొగుట, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త :** తొగుట గ్రామంలోని బిజెపి సీనియర్ నాయకులు పద్మాకర్‌రెడ్డి మరణించిన విషయం తెలు సుకొని బాధిత కుటుంబాన్ని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు గురువారం పరామర్శించి ఓదార్చారు. అలాగే తొగుటకు చెందిన బిజెపి కార్యకర్త నార్లపురం హరీష్‌గౌడ్ ప్రమాదం జరగడంతో హరీష్‌ను పరామర్శించి అరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మండల పరిధిలోని ఎల్లారెడ్డిపేటలో గణపతి నరేష్ చనిపోవడంతో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శి ంచి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ప్రజాప్రతి నిధులు చిక్కుడు చంద్రం, విభీషణ్‌రెడ్డి, నంట స్వామిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, పరమేష్, అంజనేయులు, బాల్‌రెడ్డి, మహేష్, శ్రీకాంత్, కర్ణాకర్, మురళి, శ్రీనివాస్, తిరుపతి తదితరులు ఉన్నారు.



సంగీత బాయికి ఎల్‌ఓసి అందజేస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డిల

## పేదల ఆరోగ్యానికి ఆసరాగా ఎల్‌ఓసి : ఎమ్మెల్యే

**కంగ్టి, సెప్టెంబరు 14, ప్రభాతవార్త:** పేదల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు ఆసరగా ఉంటున్నాయని నారాయణఖేడ్ శాసన సభ్యులు మహారెడ్డి భూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని సిద్దంగర్గ గ్రామానికి చెందిన లక్ష్మికి 52వేలు, సర్దార్ తండాకు చెందిన సంగీత బాయికి 39వేల 5వందల రూపాయల ఎల్‌ఓసిలను ఎమ్మెల్యే బాధితులకు అందచేశారు.కార్యక్రమంలో మతుర లబాన్ సమాజ్ మహిళా అధ్యక్షురాలు చిమ్ని బాయి, సర్దార్ తండా సర్పంచ్ తనయుడు, బిఆర్‌ఎస్ నేత రాజేందర్, బోర్గి సర్పంచ్ జయశ్రీ గజానంద్, బాధిత కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు.

## యువతకు డ్రైవింగ్ లర్నింగ్ లైసెన్సుల పంపిణీ



యువతకు డ్రైవింగ్ లర్నింగ్ లైసెన్సులు అందచేస్తున్న సర్పంచ్

**న్యాల్‌కల్, సెప్టెంబరు 14, ప్రభాతవార్త:** 18 సంవత్సరాలు నిండిన యువకులకు ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు సహకారంతో డ్రైవింగ్ లర్నింగ్ లైసెన్సు పత్రాలను అందచేశారు. మండలంలోని కల్‌బేమల్ గ్రామానికి చెందిన 25మంది యువకులకు గ్రామ సర్పంచ్ మహిపాల్ ఎల్‌ఎల్‌ఆర్ పత్రాలను అందచేశారు. డ్రైవింగ్ లైసెన్సులు లేకుండా వాహనాలను రోడ్డుపై తోలరాదన్న ఉద్దేశంతో ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు నియోజకవర్గంలోని ఆయా మండలాల యువతకు ఉచితంగా డ్రైవింగ్ లైసెన్సులు అందచేసేందుకు శ్రీకారం చుట్టారన్నారు. లర్నింగ్ లైసెన్సులు అందుకున్న యువకులు ఎమ్మెల్యే మాణిక్‌రావుకు, అందుకు సహకారం అందించిన సర్పంచ్ మహిపాల్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

### ఎంబిఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఆధ్వర్యంలో..

**కంగ్టి, సెప్టెంబరు 14, ప్రభాతవార్త:** యువకులకు ఎంబిఆర్ ఫౌండేషన్ చైర్మన్ మహారెడ్డి రోషన్‌రెడ్డి గురువారం ఉచిత డ్రైవింగ్ లర్నింగ్ లైసెన్సులను పంపిణి చేశారు. తడ్కల్ గ్రామానికి చెందిన 100 మంది వరకు లైసెన్సుల కొరకు రిజిస్ట్రేషన్ చేసుకోగా గురువారం మహారెడ్డి రోషన్‌రెడ్డి 30 మందికి లర్నింగ్ లైసెన్సు పత్రాలను పంపిణి చేశారు. డ్రైవింగ్ లైసెన్సులు లేనిదే వాహనాలను తోలరాదని రోషన్‌రెడ్డి సూచించారు. మండల బిఆర్‌ఎస్ అధ్యక్షులు గంగారాం, జడ్పీటిసి సభ్యులు లలిత ఆంజనేయులు, ఎంపిటిసి సభ్యులు శ్రీకాంత్, తడ్కల్ సర్పంచ్ గడ్డం మనోహర్, నాయకులు సాయి గౌడ్, లబ్దిదారులు పాల్గొన్నారు.

## పులిమామిడి రాజుకు ఆటో యూనియన్ మద్దతు



రాజుకు మద్దతు ప్రకటిస్తున్న ఆటో యూనియన్ సభ్యులు

**సదాశివపేట, సెప్టెంబరు 14, ప్రభాతవార్త:** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులు, పిఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షులు పులిమామిడి రాజుకు సంగారెడ్డి నియోజకవర్గంలోని కంది మండలం ఆటో డ్రైవర్ యూనియన్ సభ్యులు ముదిరాజ్ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లేశం ముదిరాజ్ ఆధ్వర్యంలో గురువారం సన్మానించి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణానికి చెందిన స్వర్ణకారు సంఘం సభ్యులు సైతం పులిమామిడి రాజుకు రానున్న శాసన సభ ఎన్నికల్లో తమ మందు సంపూర్ణంగా అందిస్తామని రాజుకు హామి చేశారు.

## మల్కాపూర్‌లో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన సతీష్

**కొండాపూర్, సెప్టెంబరు 14, ప్రభాతవార్త:** మండలంలోని మల్కాపూర్‌లో సతీష్ అన్న పథకం ఆడపిల్లల కిట్టు వాల్ పోస్టర్‌ను గురువారం కాంగ్రెస్ నాయకులు సతీష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ పేద కుటుంబంలోని ఆడ బిడ్డకు అండగా ఉండేందుకు తన వంతు సహాయ సహకారాలు అందిండమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. తనకు ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం కల్పించకపోయినా నియోజకవర్గంలోని ఆడపిల్లలకు 2వేలు, పాఠశాలకు వెళ్లే ముందు 5 వేలు, పెళ్లి సమయంలో 10వేల రూపాయల ఆర్థిక సహాయం అందచేస్తానన్నారు. ఈ నెల 22వ తారీఖున కతన పుట్టిన రోజు సందర్భంగా పేదింటి ఆడపిల్లల కోసం సతీస్ అన్న పథకం కిట్టును అమలు చేయనున్నట్లు ప్రకటించారు. పేదలకు అందించే సహకారం మనసుకు ప్రశాంతత కల్పిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లు సతీష్ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎమ్ సభ్యులు పాల్గొన్నారు.

## అందోలు చెరువులో మృతదేహం లభ్యం

**జోగిపేట, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త:** అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన గురువారంనాడు అందోలు చెరువులో జరిగింది. అందోలు చెరువు అలుగు వద్ద ఓ వ్యక్తి మృతదేహం తేలియాడుతుండటం గమనించిన కొందరు పోలీసులకు సమాచారం ఇవ్వటంతో, అందోలు చెరువు అలుగు వద్దకు పోలీసులు చేరుకుని మృతదేహాన్ని వెలికి తీయించారు. అనంతరం మృతదేహం వద్ద లభించిన ఫోన్ ఆధారంగా అతని వివరాలు కనుగొన్నారు. మృతుడు హైద్రాబాదు మంగళహాట్ ప్రాంతంలోని ఇందిరానగర్‌కు చెందిన బసంత్‌పురే శివ(32)గా గుర్తించారు. కాగా అతని సోదరుడు బసంత్ రాజు ఫిర్యాదుమేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని జోగిపేట ఎస్ఐ గైబప్ప తెలిపారు.

## మహిళా వికాస్ కేంద్రంలో న్యాయ అవగాహన

**సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 14, ప్రభాతవార్త:** జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలు, జిల్లా సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి సుదర్శన్ సూచనల మేరకు గురువారం పట్టణంలోని మహిళా వికాస్ కేంద్రంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జె హన్మంతరావు న్యాయ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి హన్మంత్‌రావు మాట్లాడుతూ వికాస కేంద్రంలో శిక్షణ పొందుతున్న వారు శిక్షకులు చెబుతున్న ప్రకారం పనులు చేసుకోవాలని సూచించారు. తమ భవిష్యత్తును బంగారు మయం చేసుకునేందుకు శిక్షకల సూచనలు విధిగా పాటించాలని పేర్కొన్నారు. మహిళల అక్రమ రవాణ చేస్తున్నట్లు, అందుకు మహిళలు కొత్తవారితో తగు జాగ్రత్తలు పాటిస్తూ మసులుకోవాలని వివరించారు. కార్యక్రమంలో మహిళా వికాస కేంద్రం మేనేజర్ సుగుణమ్మ, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

### కిషన్‌రెడ్డి అరెస్టుకు నిరసనగా బిజెపి ధర్నా

**పాపన్నపేట, సెప్టెంబరు 14, ప్రభాతవార్త:** కేంద్ర మంత్రి, రాష్ట్ర భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు కిషన్‌రెడ్డిని అరెస్టు చేయడం అవివేకమని భారతీయ జనతా పార్టీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. కిషన్‌రెడ్డి అరెస్టును నిరసిస్తూ గురువారం మండల కేంద్రమైన పాపన్నపేటలో బిజెపి నాయకులు రాస్తా రోకో నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి మండల అధ్యక్షులు సంతోష్ మాట్లాడుతూ నిరుద్యోగుల పక్షాన పోటారం చేస్తే అరెస్టు చేయడం ప్రజాస్వామ్యాన్ని కూని చేయడం కాదా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.కార్యక్రమంలో మండలంలోని ఆయా గ్రామాల బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మండల స్థాయి క్రీడలను ప్రారంభిస్తున్న ఎంపిపి చైతన్య విజయభాస్కర్‌రెడ్డి

## 67వ ఎస్‌జిఎఫ్ మండల స్థాయి క్రీడలు ప్రారంభం

**పుల్కల్/చౌకూరు, సెప్టెంబరు 14, ప్రభాతవార్త:** 67వ ఎస్‌జిఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీలను ఉమ్మడి పుల్కల్ మండలంలో గురువారం ఎంపిపి అధ్యఓఉలు చైత్య విజయభాస్కర్‌రెడ్డి టాస్ వేసి ప్రారంభించారు. పుల్కల్‌లో టిఎస్ డబ్లుఆర్‌ఎస్ సింగూరు క్రీడా ప్రాంగణంలో, చౌటకూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఎంపిపి అధ్యక్షులు చైతన్య విజయభాస్కర్‌రెడ్డి టాస్ వేసి ఫిజికల్ డైరెక్టర్ ఆసిఫ్‌లతో ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిపి చైతన్య విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ 14 సంవత్సరాల నుంచి 19 సంవత్సరాల విద్యార్థులకు కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మండల స్థాయిల పోటీలలో పుల్కల్, గంగ్లూర్, ముదిమాణిక్యం గ్రామాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, టిఎస్‌ఎంఎస్ బస్వాపూర్, టిఎస్ డబ్లుఆర్‌ఎస్ సింగూరు పాఠశాలల విద్యార్థులు క్రీడల్లో పాల్గొంటారన్నారు. క్రీడలు శారీక దారుడ్యానికి దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో పిడి రాజు, అరుణ్ కుమార్, పిఈటి నాగగౌడ్, అరుణ, చౌటకూరు కార్యక్రమంలో మోహన్‌రెడ్డితో పాటు ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## ఫేస్ రికగ్నిషన్‌తో విద్యార్థుల హాజరు నమోదు



ఖమ్మంపల్లి పాఠశాలలో ఫేస్ రికగ్నిషన్ ద్వార విద్యార్థుల హాజరు

**మునిపల్లి, సెప్టెంబరు 14, ప్రభాతవార్త:** మండలంలోని ఖమ్మంపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల హాజరును ఫేస్ రికగ్నిషన్‌తో నమోదు చేసే కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. కృత్రిమ మేధ సాంకేతికత పరిజ్ఞానంతో విద్యార్థుల హాజరును నమోదు చేయనున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు యండి ఖంరోద్దిన్ పేర్కొన్నారు. డిఎస్ఈ ఎఫ్‌ఆర్‌ఎస్ పేరిట యాప్‌ను పాఠశాల విద్యా శాఖ రూపొందించిందన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల చిత్రాలను యాప్ ద్వార హాజరును నమోదు చేసుకోవచ్చన్నారు. విద్యార్థుల హాజరు శాతం పారదర్శకంగా ఉంటుందన్నారు. ఆయా పాఠశాలల విద్యార్థుల హాజరున యాప్ ద్వార రాష్ట్ర విద్యా శాఖ అధికారులు పర్యవేక్షిస్తారన్నారు. యాప్ సహాయంతో ఒకే మారు 15 నుంచి 20 విద్యార్థుల హాజరును నమోదు చేయవచ్చన్నారు. 1వ తరగతిలో విద్యను అందుకుంటున్న విద్యార్థి కన్ను, చెంప, ముక్కు లాంటి 70 రేషియల్ పాయింట్లను నమోదు చేస్తారని, డిగ్రిలో విద్యను అందుకునే వరకు విద్యార్థి ఫేసియల్ పాయింట్లు ఉపయోగపడుతుందన్నారు.

## బేగరి ప్రవీణ్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే



బిఆర్‌ఎస్ నేత బేగరి ప్రవీణ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

**న్యాల్‌కల్, సెప్టెంబరు 14, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన న్యాల్‌కల్ గ్రామానికి చెందిన బిఆర్‌ఎస్ యువ నాయకులు బేగరి ప్రవీణ్ తండ్రి బేగరి అంజప్ప గురువారం ఉదయం గుండెపోటుతో తిరిగిరాని లోకాలకు చేరిపోయారు. బేగరి అంజప్ప మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు న్యాల్‌కల్ గ్రామంలోని అంజప్ప నివాసానికి చేరుకుని పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు ఆసనుభూతి ప్రకటించారు. కార్యక్రమంలో జడ్పీటిసి సభ్యులు బోడ స్వప్న భాస్కర్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యఓఉలు రవి, మల్గి సర్పంచ్ మారుతి యాదవ్, బిఆర్‌ఎస్ మండల మైనార్టీ అధ్యక్షులు మక్సూద్ అలీ, మాజీ ఎంపిటిపి సభ్యులు నాగయ్య, నాయకులు బసయ్యస్వామి, మఠం శివుస్వామి, ఖదార్, స్వామిదాస్, శ్రీనివాస్, సున్నపు సత్యనారాయణ, సంజీవ్, ప్రభాకర్, ఖలీల్, దేవదాస్, ఇస్మాపటేల్, శివరాజ్ పాల్గొన్నారు.

## నాగ్సన్‌పల్లిలో గొల్ల కురుమలకు గొర్రెల పంపిణీ



నాగ్సన్‌పల్లిలో గొర్రె కాపరులకు గొర్రెలను పంపిణీ చేస్తున్న సొసైటీ చైర్మన్

**సదాశివపేట, సెప్టెంబరు 14, ప్రభాతవార్త:** మండలంలోని నాగ్సన్‌పల్లి గ్రామానికి చెందిన గొల్ల కురుమాలకు సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే, బిఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర హ్యాండ్లూమ్ కార్పోరేషన్ చైర్మన్ చింత ప్రభాకర్ సూచనల మేరకు 16 యూనిట్ల గొర్రెలను (ఒక్కో యూనిట్ 1లక్ష 75వేల రూపాయలు) గ్రామ సర్పంచ్ లక్ష్మీ చంద్రశేఖర్‌తో కలిసి సొసైటీ చైర్మన్ రత్నాకర్‌రెడ్డి పంపిణి చేశారు. ఈ సందరంగా సొసైటీ చైర్మన్ రత్నాకర్‌రెడ్డి, మండల బిఆర్‌ఎస్ అధ్యక్షులు పెద్ద గొల్ల ఆంజనేయులులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు రాష్ట్ర ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని కొనియాడారు. గత ప్రభుత్వాలు కులవృత్తులను పట్టించుకున్న పాపన పోలేదని దుయ్యబట్టారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటి డైరెక్టర్ మఠం కరుణాకర్, నాయకులు రాజశేఖర్‌రెడ్డి, శివకుమార్, దశరథ్, బిక్షపతి, శంకరయ్య, మల్లయ్య, గణేష్, రమేష్, నాగరాజు, లబ్దిదారులు పాల్గొన్నారు.

## అమావాస్య పూజలు అందుకున్న కేతకి సంగమేశ్వరుడు

**ఝరాసంగం, సెప్టెంబరు 14, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఝరాసంగంలో పార్వతీ దేవి సమేతంగా కొలువుండి దక్షిణ కాశీగా భక్తులచే నిత్య పూజలందుకుంటున్న శ్రీ కేతకి సంగమేశ్వరుడు గురువారం అమావాస్య పూజలు అందుకున్నాడు. అమావాస్యను పురస్కరించుకుని ఆలయానికి ఉమ్మడి మెదక్ జిల్లాతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకోవడంతో ఆలయ పరిసరాలను భక్తులతో సందడిగా మారింది. ఆలయానికి చేరుకున్న భక్తులు అమృతగుండంలో పుణ్యస్నానాలు ఆచరించి దైవదర్శనం చేసుకున్నారు. ఆలయ గర్భగుడిలో అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తుండగా భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కు బడులు చెల్లించుకున్నారు. ఆలయానికి ఆయా ప్రాంతాల నుంచి చేరుకున్న భక్తులకు దాతల సహకారంతో అన్నదానం ఏర్పాటు చేశారు.



కేతకి సంగమేశ్వరుడి దర్శనానికి బారులు తీరిన భక్తులు



చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును ఖండిస్తున్న రాష్ట్ర అధ్యక్షులు పృథ్వీరాజ్

## చంద్రబాబు నాయుడు అరెస్టును ఖండించిన పృథ్వీరాజ్

**సదాశివపేట, సెప్టెంబరు 14, ప్రభాతవార్త:** మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడును అక్రమంగా అరెస్టు చేయడం సరికాదని తెలంగాణ మంజీర రైతు సమితి రాష్ట్ర అధ్యక్షులు పృథ్వీరాజ్ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా పృథ్వీరాజ్ మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో ఉమ్మడి రాష్ట్ర ఐటి రంగంతో పాటు పలు రంగాల్లో అభివృద్దిలో దూసుకుపోయినట్లు గుర్తు చేశారు. అన్ని వర్గాలను రాజకీయంగా సమన్యాయం చేసిన ఘనత చంద్రబాబునాయుడుకే దక్కుతుందన్నారు. రాజకీయలబ్ది కోసం చంద్రబాబు నాయుడను క్షక్షపూరితంగా అక్రమంగా అరెస్టు చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు సంగశెట్టి, రాఘవేందర్, మహేష్, తోట చంద్రశేఖర్, సంగన్న, అంజన్న, శ్రీనివాస్, గాండ్ల రవీందర్, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## నాగల్‌గిద్దలో ఘనంగా ఉపాధ్యాయుల దినోత్సవం



ఉత్తమ ఉపాధ్యాయులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

**నాగల్‌గిద్ద, సెప్టెంబరు 14, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన నాగల్‌గిద్దలోని రైతు వేదికలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉత్తమ ప్రతిభ చాటిన నియోజకవర్గంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలకు చెందిన 32 మంది ఉపాధ్యాయులు, అధ్యాపకులకు ఎమ్మెల్యే ప్రశాంసాపత్రాలు, జ్ఞాపికలు అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి సమాజంలో మహోన్నత స్థానంలో ఉంటుందన్నారు. అందరికి విద్యను అందించాలన్న సంకల్పంతో ప్రతి మండల కేంద్రంలో వసతి గృహం వసతితో కూడిని పాఠశాలలు (రెసిడెంట్ పాఠశాలలు) తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుకు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి అధ్యక్షులు మోతిబాయిరాథోడ్, జడ్పీటిసి సభ్యులు రాజురాథోడ్, మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షులు నందు పాటిల్, కరస్‌గుత్తి సర్పంచ్ సంజీవరెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు, ఎంపిడిఓ రాజశేఖర్ కవల్‌లాస్, నాయకులు నాగిశెట్టి ప్రహ్లాద్, శేషు, ప్రధానోపాధ్యాయులు పి భాస్కర్, శివశంకర్ రాథోడ్, మోర్గి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రమేష్, రాఘవేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు



ఎమ్మెల్యే సమక్షంలో బిఆర్‌ఎస్‌లో కాంగ్రెస్ నాయకులు

**జహీరాబాద్(కోహీర్), సెప్టెంబరు 14, ప్రభాతవార్త:** మండలంలోని బిలాల్‌పూర్ గ్రామానికి చెందిన వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పెద్ద సంఖ్యలో (100మంది)గురువారం ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు సమక్షంలో రాష్ట్ర ఐడిసి చైర్మన్ మహమ్మద్ తన్వీర్, పార్టీ మండల అధ్యక్షులు నర్సింలు యాదవ్‌ల ఆధ్వర్యంలో బిఆర్‌ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన కాంగ్రెస్ నాయకులను బిఆర్‌ఎస్ ఖండువాలు కప్పి పార్టీలోకి ఎమ్మెల్యే స్వాగతం పలికారు. రాష్ట్రంలో పేదల సంక్షేమానికి ముఖ్యమంత్రి చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై బిఆర్‌ఎస్ పార్టీలో చేరినట్లు పంచాయితీ వార్డు సభ్యులు, నాయకులు బలవల్లి నవీన్, విభూతి లక్ష్మి, చంద్రమ్మ, అనిత, వినోద, సతీష్, చంద్రకాంత్, తరుణ్, పేర్ల హరికృష్ణ తదితరులు పేర్కొన్నారు. ఆత్మ కమిటి చైర్మన్ పెంటారెడ్డి, మాజీ చర్మన్ రామకృష్ణరెడ్డి, మాజీ మండల అధ్యక్షులు సురేందర్‌రెడ్డి, నాయకులు సుభాష్‌రెడ్డి, రవికిరణ్, సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు, నాయకులు సంతప్, విఠల్‌రెడ్డి, వినోద్, సునీల్ తదితర్రులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలపై కళాకారుల అవగాహన



కళాకారులను సన్మానిస్తున్న సర్పంచ్ మారుతి యాదవ్

**న్యాల్‌కల్, సెప్టెంబరు 14, ప్రభాతవార్త:** తెలంగాణ సంస్కృతిక సారధి కళాకారులు మండలంలోని మల్గి గ్రామంలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ది, సంక్షేమ పథకాలపై గ్రామస్థులకు ఆటలు ఆడుతూ పాటలు పాడుతూ అవగాహన కల్పించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కును నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు (ఆసరా, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, దివ్యాంగులకు, ఒంటరి మహిళలకు పెన్షన్, రైతు బంధు, రైతు భీమా, హరితహారం, విద్య, ఆరోగ్యం తదితర)లపై అవగాహన కల్పించారు. గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించిన కళాకారులను గ్రామ సర్పంచ్, మండల సర్పంచ్‌ల ఫోరం ఉపాధ్యాక్షులు మారుతి యాదవ్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మారుతి యాదవ్, సిపి నర్సారెడ్డి, కళాకారులు ఎ సునీల్, డి రమేష్, ఎన్ దుర్గేష్, బి నవీన్, ఎస్ శంకర్, జి శంకర్ పాల్గొన్నారు.

## హలో మాల ఛలో ఢిల్లీ కరపత్రం ఆవిష్కరణ

**సదాశివపేట, సెప్టెంబరు 14, ప్రభాతవార్త:** సంగారెడ్డి జిల్లాకు చెందిన మాల మహానాడు నాయకులు ఎస్‌సి వర్గీకరణకు వ్యతిరేకంగా ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద నిర్వహించే దీక్షల ధర్నా వాల్ పోస్టర్‌ను గురువారం భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులు, పిఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షులు పులిమామిడి రాజు చలో మాల, ఛలో ఢిల్లీ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. మాల మహానాడు నాయకులు, పిఎంఆర్ యువసేన నాయకులు పాల్గొన్నారు.



హలో మాల ఛలో ఢిల్లీ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న పులిమామిడి రాజు



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చింత ప్రభాకర్

## ఇనేసున్నతుల్ జమాత్ దర్గాను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే

**సదాశివపేట, సెప్టెంబరు 14, ప్రభాతవార్త:** పట్టణంలోని ఇనేసున్నతుల్ జమాత్ దర్గాను గురువారం సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే, బిఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర హ్యాండ్లూమ్ కార్పోరేషన్ చైర్మన్ చింత ప్రభాకర్ దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్గాకు చేరుకున్న చింత ప్రభాకర్‌ను దర్గా నిర్వాహకులు సాదరంగా ఆహ్వానించి సన్మానించారు. దర్గా వద్ద నెలకొన్న సమస్యలను నిర్వాహకులు చింత ప్రభాకర్ దృష్టికి తేగా పరిష్కారానికి మాజీ ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు.

## చింత ప్రభాకర్‌కు మద్దతు ప్రకటించిన కౌన్సిలర్



చింత ప్రభాకర్‌కు మద్దతు ప్రకటిస్తున్న కౌన్సిలర్

**సదాశివపేట, సెప్టెంబరు 14, ప్రభాతవార్త:** పట్టణంలోని వార్డు కౌన్సిలర్ సతాని లలిత శ్రీశైలం తన అనుచరులతో కలిసి గురువారం సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే, బిఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర హ్యాండ్లూమ్ కార్పోరేషన్ చైర్మన్ చింత ప్రభాకర్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. వార్డు అభివృద్దికి అందించిన సహకారానికి కౌన్సిలర్ కృతజ్ఞతలు తెలిపి శాలువాతో చింత ప్రభాకర్‌ను సన్మానించారు. రానున్న శాసన సభ ఎన్నికల్లో చింత ప్రభాకర్ విజయమే లక్ష్యంగా సేవలు అందిస్తామని కౌన్సిలర్ సతాని లలిత శ్రీశైలం పేర్కొన్నారు.

## సొసైటీ భవన నిర్మాణం చేయిస్తా : కార్పోరేటర్



కార్పోరేటర్ పుష్పనగేష్‌ను సన్మానిస్తున్న శ్రీనివాస్ నగర్ వాసులు

**రామచంద్రాపురం, సెప్టెంబరు 14, ప్రభాతవార్త:** రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని శ్రీనివాస్ నగర్ కాలనీ సండే మార్కెట్ వద్ద వద్ద ఉన్న వార్డు కార్యాలయంలో సాయి నగర్‌కాలనీ వాసులు కార్పోరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్‌ను గురువారం ఘనంగా సన్మానించారు. సాయి నగర్ కాలనీ బస్సు డిపో కాలనీ వాసులు తమకు కూర్చోవడానికి సొసైటీ భవనం లేదని కార్పోరేటర్ దృష్టికి తేగా వెంటనే ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సహకారంతో కాళీ స్థలం కేటాయించి నూతన భవనం నిర్మాణం చేయిస్తానని కార్పోరేటర్ హామి చేశారు. భవన నిర్మాణానికి కార్పోరేటర్ హామి ఇవ్వడంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తూ శాలువాతో కార్పోరేటర్‌ను సన్మానించారు. కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని కార్పోరేటర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు లక్ష్మణ్ యాదవ్, రవి కిరణ్ గౌడ్, నారాయణ, రాజు, పండరి, మల్లేష్, గోపాల్‌రెడ్డి, వెంకటేశం గుప్తా, నర్సింలు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎడ్ల పొలాల అమావాస్య



ఎడ్ల పొలాల అమావాస్యను జరుపుకుంటున్న రైతులు

**కంగ్టి, సెప్టెంబరు 14, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన కంగ్టలో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం ఎడ్ల పొలాల అమావాస్యను రైతులు భక్తి శ్రద్దలతో ఘనంగా జరుపుకున్నారు. అమావాస్యను పురస్కరించుకుని తాము సాకుతున్న పశువులను రైతులు అందంగా ముస్తాము చేసి పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రసాదాలు తినిపించారు. గ్రామంలోని ఆలయాల వద్ద ప్రదక్షిణలు చేయించారు. ఆలయాల వద్ద ప్రదక్షిణలు చేస్తున్న పశువులు పెట్టిన పేడను (పెండ) సేకరించి తొమ్మిది రోజుల బొడ్డెమ పండగను ఆడపిల్లలు ప్రారంబించడం ఆనవాయితీగా వస్తోంది. ఎడ్ల అమావాస్యను రైతులు ఆనందోత్సవాలతో భక్తి శ్రద్దలతో ఘనంగా జరుపుకున్నారు.

## మాణిక్‌ప్రభు ఆలయాన్ని దర్శించుకున్న మాణిక్యం



పట్నం మాణిక్యంను సన్మానిస్తున్న మాణిక్ ప్రభు ఆలయ కమిటీ

**సదాశివపేట, సెప్టెంబరు 14, ప్రభాతవార్త:** పట్టణంలోని మాణిక్‌ప్రభు ఆలయాన్ని డిసిసిబి వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం గురువారం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న పట్నం మాణిక్యంను ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయంలో అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తుండగా మాణిక్యం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పట్నం మాణిక్యంను ఆశీర్వచనాలు చేసి తీర్థ ప్రసాదాలు అందచేశారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్దికి తన వంతుగా 5లక్షల రూపాయలను విరాళంగా అందచేస్తానని పట్నంమాణిక్యం హామి చేశారు. కార్యక్రమంలో సంగారెడ్డి మాజీ ఎంపిపి అశోక్, మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ కోడూరు రమేష్, బిఆర్‌ఎస్ నాయకులు ప్రేమనందం, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## చైర్మన్ నరోత్తంను సన్మానించిన పాస్టర్లు

**జహీరాబాద్, సెప్టెంబరు 14, ప్రభాతవార్త:** రాష్ట్ర ఎస్సీ అభివృద్ది సంస్థ కార్పోరేషన్ చైర్మన్ వై నరోత్తంను గురువారం పాస్టర్లు ఘనంగా సన్మానించారు. పట్టణంలోని మెథడిస్ట్ సెంటర్ చర్చి డిఎస్ జాన్ వెస్లీ లే సెక్రెటరీ వై రవికుమార్‌ల ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని పాస్టర్లు నరోత్తంను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ది కొరకు తన వంతు కృషి చేస్తానన్నారు. ఎస్సీల అభ్యున్నతే లక్ష్యంగా సేవలు అందిస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో పాస్టర్లు ఇజ్రాయిల్, జార్జి, అబ్రహం, రాజు, సుందర్‌రాజు, విజయ చంద్ర సామేల్, దిలీప్ పాల్గొన్నారు.